
పెద్ద పులి పాద ముద్ర

సర్కారు కాకి దగా డీఎస్సీ



- ఆవేదనతో రగిలిపోతున్న నిరుద్యోగులు
- ఉమ్మడి తూర్పులో 2 వేల పోస్టులు ఖాళీ?
- ఇప్పుడు 390 పోస్టులకే నోటిఫికేషన్
- ఒక్కో ఉద్యోగానికి వేలల్లో దరఖాస్తులు
- సన్నద్ధతకూ సమయం లేక లబోదిబో
- అభ్యర్థుల్లో తీవ్ర మానసిక ఒత్తిడి
- ఎన్నికల ఎత్తు.. యువతకు మోసం

ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు బ్లాక్‌బోర్డంత.. భర్తీ చాక్‌పీసంత

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఐదేళ్లుగా ఎప్పుడా ఎప్పుడా అని ఎదురుచూస్తున్న డీఎస్సీ నోటిఫికేషన్ ఎన్నికల ఎత్తులో భాగంగా పరుగు పరుగున వచ్చేసి మెగా పేరుతో భావి ఉపాధ్యాయులను దగా చేస్తోంది. ఖాళీలు బ్లాక్ బోర్డంత ఉండగా భర్తీల సంఖ్య మాత్రం చాక్‌పీసంత కూడా లేదు. పైగా సన్నద్ధం కావడానికి తగు సమయాన్ని ప్రసాదించలేదు. కనీసం రివిజన్‌కి కూడా సమయం సరిపోదని ఎప్పటి నుంచో ప్రిపేర్ అవుతున్న వాళ్లు చెబుతున్నారు. దీంతో యువత ఒత్తిడిలో మునిగిపోయింది. తాము అధికారంలోకి వస్తే ప్రతి ఏడాదీ ఉద్యోగ నోటిఫికేషన్లను వరదలా పారిస్తామంటూ గప్పాలు కొట్టిన జగన్.. ఎన్నికల వేళ ఓ నోటిఫికేషన్‌ను హడావుడిగా తెరపైకి తెచ్చారు.గత ఎన్నికల ముందు ఓట్ల కోసం మెగా డీఎస్సీ అని ఊదరగొట్టిన జగన్‌కి మళ్లీ ఎన్నికల సమయానికిగానీ ఉద్యోగార్థుల ఆవేదన వినిపించలేదు.

ఖాళీలు 2వేల పైమాటే

ఉమ్మడి తూర్పు గోదావరిని పరిగణనలోకి తీసుకొని డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేశారు. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి కలిపి సుమారు 2వేలపైనాఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు ఉన్నట్టు తెలుస్తోంది. డీఎస్సీ నిర్వహణను కాకినాడ జిల్లా డీఈవో చూస్తున్నారు. ఆయన ఖాళీల సంఖ్యపై గోప్యత పాటిస్తున్నారు. ఐదేళ్లుగా నోటిఫికేషన్‌ని ప్రభుత్వం మరిచిపోవడంతో పెద్ద సంఖ్యలో ఖాళీలు పేరుకుపోయాయి.అలాగే అప్పటి నుంచీ కోచింగ్ తీసుకుంటున్న వాళ్లు ఏడాదికేడాదీ కలుస్తూ ఉద్యోగార్థుల సంఖ్య ఖాళీల కంటే చాలా రెట్లు ఎక్కువగా ఉంది.జగన్ ప్రభుత్వం అలసత్వం వల్ల పోటీ విపరీతంగా పెరిగిపోయింది. ఆ మేరకు అభ్యర్థుల్లో కూడా మానసిక ఒత్తిడి అధికమైంది. ఇప్పుడు మెగా డీఎస్సీ పేరుతో కేవలం 390 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయడంతో నిరుద్యోగులు విస్తుపోతున్నారు. ఒక్కో పోస్టుకు వేలల్లో దరఖాస్తులు వచ్చిపడ్డాయి.

సన్నద్ధతకు సమయమేదీ..

ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ఓట్లు రాబట్టుకునే ప్రణాళికలో భాగంగా ఎన్నికల షెడ్యూల్‌కి నెలముందు ప్రభుత్వం డీఎస్సీని ప్రకటించింది. ఉపాధ్యాయ అర్హత పరీక్షకు 20 రోజులు సమయం ఇచ్చి తర్వాత 10 రోజులకే డీఎస్సీ పెడుతున్నారు. ఇంత తక్కువ సమయంలో అభ్యర్థులు రెండింటికీ ఎలా సన్నద్ధమవుతారని కూడా పాలకులు ఆలోచించలేదు. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో వచ్చే మార్కులకు డీఎస్సీలో 20 శాతం వెయిటేజీ ఇస్తారు. కాబట్టి గతంలో టెట్ రాసినవాళ్లు కూడా మార్కులు పెంచుకునేందుకు మళ్లీ రాయడానికి సిద్ధమవుతుంటారు.గతంలో టెట్ రాయనివాళ్లు వెయిటేజీ కోసం ఎలాగూ రాయాల్సి ఉంటుంది. టెట్ సిలబస్ తక్కువేమీ ఉండదు. టెట్ సిలబస్‌ని 20 రోజుల్లో పూర్తి చేయడం అసాధ్యం. తర్వాత డీఎస్సీకి 10 రోజులే సమయం ఉంటుంది. టెట్‌తో పాటు జీవిత పయనాన్ని నిర్ణయించే డీఎస్సీకి సన్నద్ధం కావడం ఎలా సాధ్యమో జగనే చెప్పాలని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. ఒకపక్క పోస్టులు అతి తక్కువగా ఉండడం.. మరో పక్క పరీక్షల షెడ్యూల్‌తో విపరీతమైన టెన్షన్ కలిసి ఉద్యోగార్థులకు జగన్ మెంటల్ టార్చర్ అంటే ఏంటో అనుభవించేలా చేస్తున్నారు.కొందరు అభ్యర్థులు సోషల్ మీడియాలో పెడుతున్న పోస్టులు కంటనీరు పెట్టిస్తున్నాయి.

ఆన్‌లైన్ కష్టాలు..

ఇసుక.. మద్యం వ్యాపారంలో ఆరితేరిన పాలకులు చివరికి నిరుద్యోగులనూ వదలడం లేదు. పోస్టుల లేమితో ఓ వైపు ఇబ్బంది పడుతుంటే ఆన్‌లైన్ కష్టాలు ముప్పుతిప్పలు పెడుతున్నాయి. ఎలాంటి ముందస్తు కసరత్తు లేకుండా నోటిఫికేషన్‌ని ఎన్నికల వేళ హడావుడిగా ఇచ్చేయడం అభ్యర్థుల పాలిట శాపంగా మారింది. చివరికి ఫిర్యాదు చేయాలంటే సహాయ కేంద్రాల ఫోన్ నెంబర్లు కూడా వారితో ఆడుకుంటున్నాయి. ప్రతి దానికీ ఫీజును విధించి సర్కారువారు పేదలతో వ్యాపారం చేస్తున్నారు. తప్పులు వస్తే సరిచేయడానికి మరో ఆప్షన్ ఇవ్వకుండా రూ.750 కట్టాలని ఆన్‌లైన్‌లో చూపిస్తోంది. ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి దుస్థితి లేదని ఉద్యోగార్థులు వాపోతున్నారు. డీఎస్సీలో అభ్యర్థులు ఎక్కువ పోస్టులు ఉన్న జిల్లాలో పరీక్ష రాసేందుకు మొగ్గుచూపుతారు. దరఖాస్తు చేసే సమయంలో స్థానికేతర ఆప్షన్ ఎంచుకుంటే అన్ని జిల్లాల పేర్లు వస్తే అభ్యర్థి తాను కోరుకున్న జిల్లాను ఎంచుకుంటారు. కానీ చిత్రంగా స్థానికేతర ఆప్షన్ వస్తుంది కానీ జిల్లాల పేర్లు కనిపించడం లేదు. దీంతో మెరిట్ కోటా కింద దరఖాస్తు చేసుకునే వెసులుబాటును కోల్పోతున్నారు. స్కూల్ అసిస్టెంట్లతో పాటు ఇతర ఉద్యోగాలకూ జిల్లాల జాబితా రావడం లేదు.మరో విచిత్రం ఏమిటంటే.. పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లు(పీజీటీ), ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లు (టీజీటీ) పోస్టులు జోనల్ స్థాయిలో ఉంటాయి. వారికీ అదే పరిస్థితి ఎదురవుతోంది. జోన్ ఆప్షన్ వస్తుందేగానీ జోన్‌ల జాబితా రావడం లేదు. దరఖాస్తుకు కేవలం 10 రోజుల సమయం మాత్రమే ఇచ్చి సర్వర్ సమస్యలను పట్టించుకోవడం వదిలేశారు.

జగన్ మార్కు మెలిక

డీఎస్సీ నోటిఫికేషన్ విషయంలోనూ జగన్ మార్కు మెలిక తప్పలేదు. డీఎస్సీ పోస్టుల భర్తీలో కీలకమైన సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ) పోస్టులకు బీఈడీ అభ్యర్థులను అర్హులుగా ప్రకటించి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ప్రక్రియ జాప్యం చేయాలనే పన్నాగం పన్నినట్టు కనిపిస్తోంది. ఎస్జీటీ పోస్టులకు బీఈడీ అభ్యర్థులు అనర్హులని గతంలో సుప్రీంకోర్టు చెప్పింది. కోర్టులంటే గౌరవం లేని జగన్ ప్రభుత్వం ఆ ఆదేశాలు తెలిసి ఎస్జీటీ పోస్టులకు బీఈడీ వాళ్లను అర్హులుగా ప్రకటిస్తూ నోటిఫికేషన్ ఇచ్చేసింది. అయితే హైకోర్టు మొట్టికాయలతో ఎస్జీటీ పోస్టులకు డీఎడ్ వారిని మాత్రమే అనుమతిస్తామని తెలిపింది. ఇప్పుడు ఎస్జీటీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారి పరిస్థితి అయోమయంలో పడింది. వారు కట్టిన ఫీజు విషయమూ అంతే.

జిల్లా అధికారుల్లో భయం

డీఎస్సీ నిర్వహిస్తున్న అధికారులు ప్రభుత్వం నుంచి వస్తున్న మౌఖిక ఆదేశాలను పక్కాగా పాటిస్తున్నారు. అవి అభ్యర్థుల సమస్యలు తీర్చేవని అనుకుంటే పొరబాటే. ఎలాంటి సమాచారాన్నీ బయటకు పొక్కనివ్వవద్దనే ఆదేశాలు. దీంతో గుర్తించిన ఖాళీల సంఖ్యను చెప్పడానికీ జిల్లా స్థాయి అధికారులు బెంబేలెత్తిపోతున్నారు. కొందరు అధికారులు సీసీల చేతిలో తమ అధికారిక ఫోన్‌ని ఉంచుతూ వారితోనే సమాధానం చెప్పిస్తున్నారు. ఉమ్మడితూర్పులో ఎన్ని ఖాళీలను గుర్తించారనే సమాచారాన్ని ఈ క్రమంలో అత్యంత గోప్యంగా ఉంచుతున్నారు. అభ్యర్థుల ఆన్‌లైన్ తిప్పలను మాత్రం పట్టించుకునే వారు కరువయ్యారు. ఇక ఈ మెగా దగా డీఎస్సీపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలను, ప్రజాసంఘాలపై ప్రభుత్వం యథావిధిగా పోలీసులను ప్రయోగిస్తోంది.

బాబోయ్ పులి

- మలకపల్లి శివారు పొలాల్లో పులి సంచారం?
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక

తాళ్ళపూడి, ఫిబ్రవరి 22 : మళ్లీ పులి కదలికలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల నల్లజర్ల, గోపాలపురం మండలాల్లో పులి సంచరించడంతో ఆయా ప్రాంతాల ప్రజలు భయం భయంగా బతికారు. అయితే పులి పాపికొండల మీదుగా అడవుల్లోకి వెళ్లిపోయిందని తెలిసి అంతా ఊపిరిపీల్చుకున్నారు. అయితే మళ్లీ పులి అడుగుజాడలు కనిపిస్తుండడంతో అమ్మో పులి.. బాబోయ్ పులి.. అంటూ భయపడుతున్నారు. తాళ్ళపూడి మండలం మలకపల్లి గ్రామం శివారు పొలాల్లో పులి పాద ముద్రలు కనిపించడంతో ఫారెస్ట్ అధికారులు అప్రమత్తమయ్యారు. పాపికొండలు నేషనల్ పార్కు నుంచి తప్పించుకు వచ్చిన పులి తాళ్ళపూడి మండలంలో తిరుగుతుందనే ప్రచారంతో పలు గ్రామాల ప్రజలు భయాందోళన పడుతున్నారు. అయితే గతంలో అడవుల్లోకి వెళ్లిపోయిన పులి మళ్లీ వెనక్కి వచ్చి ఉండొచ్చని రాజమహేంద్రవరం డీఎఫ్‌వో డి.నాగరాజు ధ్రువీకరించారు. ఇటీవల గోపాలపురం మండలం వెంకటాయపాలెం గ్రామంలో పులి అడుగులు గుర్తించగా గురువారం ఉదయం మలకపల్లి తిరుగుడుమెట్ట గ్రామాల మధ్య పొలాల్లో పులి సంచరించిన ఆనవాళ్లు రైతులు గుర్తించి అధికారులకు సమాచారం అందించారు. ఈ మేరకు అటవీశాఖ అధికారులు సంఘటనా ప్రదేశానికి చేరుకుని పులి పాద ముద్రలు పరిశీలించారు. డీఎఫ్‌వో నాగరాజు మాట్లాడుతూ రైతులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. పూర్తిగా వెలుతురు వచ్చాక గానీ పొలాలకు వెళ్లవద్దని.. చీకటి పడకుండా పొలం పనులు ముగించుకుని తిరిగి రావాలని సూచించారు. ఈ మేరకు గ్రామంలో ప్రజలకు టాం టాం ద్వారా హెచ్చరికలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో ఎల్ ధనరాజ్, దావీదురాజు, డీఆర్‌వోలు వేణుగోపాల్, మీనాక్షి, రామకృష్ణ, సూరిబాబు, ధర్మయ్య పలువురు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, తాళ్ళపూడి తహశీల్దార్ శీనివాస్, ఎస్ఐ శ్యామ్ సుందర్,పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


పులి పాదముద్రలు పరిశీలిస్తున్న అటవీ శాఖాధికారులు

మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి నిరసన

7

రేపు సర్పంచ్‌ల కలెక్టరేట్ ముట్టడి

కొవ్వూరు, ఫిబ్రవరి 22 : స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసే విధంగా వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 24వ తేదీన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు కలెక్టరేట్ల ముందు ధర్నాలు, నిరాహారదీక్షలు చేపట్టాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పాలడుగుల లక్ష్మణరావు పిలుపునిచ్చారు.కొవ్వూరులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు.ఈ నెల 20న విజయవాడలో జరిగిన సర్పంచ్‌ల సమర శంఖారావం సభ తీర్మానం మేరకు సర్పంచ్‌లు ఐక్యంగా పోరాడాలన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌రెడ్డిని ఓడించి స్థానిక సంస్థలు కాపాడుకోవాలన్నారు.

మార్చి 4న అయోధ్యకు ఆర్టీసీ బస్సు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 22 : రాజమహేంద్రవం డిపో నుంచి వివిధ హిందూ, క్రైస్తవ పుణ్యక్షేత్రాలకు సూపర్ లగ్జరీ బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. అయోధ్య, కాశీ 11 రోజుల యాత్రకు మార్చి 4వ తేదీన సూపర్ లగ్జరీ నాన్ ఏసీ బస్సు నడుపుతున్నట్టు రాజమహేంద్రవరం డిపో మేనేజర్ ఎస్‌కే షబ్నం తెలిపారు.13 మహిమాన్విత దేవాలయాల దర్శనం ఉంటుందని, టిక్కెట్ ధర ఒక్కొక్కరికీ రూ.11,800లుగా నిర్ణయించామన్నారు.అరుణాచల యాత్ర ప్రతినెలా పౌర్ణమి రోజున దర్శించుకునే విధంగా బస్సు నడుపుతున్నామని, టిక్కెట్ ఒక్కొక్కరికీ రూ.3,200లు అని తెలిపారు. క్రైస్తవ క్షేత్ర దర్శనాలకు సూపర్‌లగ్జరీ బస్సు నడపడం జరుగుతుందని టిక్కెట్ ఒక్కొక్కరికీ రూ.4,250లుగా నిర్ణయించామన్నారు.వివరాలకు 9502300189, 99666 66544, 99592 25535 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

రేపు వికాస ఆధ్వర్యంలో జాబ్ మేళా

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 22: రాజమహేంద్రవరం జిల్లా కలెక్టరేట్‌లో ఈనెల 24న వికాస ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని వికాస పీడీ కే.లచ్చారావు తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ మేనేజర్స్ ఆఫీసర్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు,డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ (ప్రొడక్షన్) సీఐఈ డిక్సన్ కంపెనీలో టెక్నీషియన్స్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో అండ్ డిగ్రీ ,బీటెక్ ఉత్తీర్ణులైన 30 ఏళ్లలోపు వయస్సుగల వారు ఇంటర్వ్యూలకు అర్హులని తెలిపారు. ఆసక్తిగల వారు ఈనెల 24న బొమ్మూరు కలెక్టరేట్ వికాస కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. సమాచారానికి 76608 23903 నెంబరులో సంప్రదించాలని కోరారు.


గోపాలపురం సీహెచ్‌సీలో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రశ్నిస్తున్న ఎంఈవో

మిడ్ డే మీల్స్ తిని.. ఐదుగురికి అస్వస్థత

గోపాలపురం, ఫిబ్రవరి 22: మండలంలోని గంగోలు గ్రామ పంచాయతీ శివారు గ్రామమైన యర్రవరం ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిని ఐదుగురు విద్యార్థులు బుధవారం రాత్రి అస్వస్థతకు గురయ్యారు.సాయంత్రం 8 గంటల సమయంలో చిన్నారులకు వాంతులు కావడంతో ఐదుగురు విద్యార్థులను తల్లిదండ్రులు హుకుంపేట పీహెచ్‌సీలో చేర్పించారు. వారిలో ఇద్దరు వెంటనే కోలుకున్నారు. మరొక ఇద్దరిని గోపాలపురం సీహెచ్‌సీకి, మరొకరిని తాళ్ళపూడి ఆసుపత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు. అస్వస్థతకు గురైన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకునేందుకు ఎంఈవో జీ.శ్రీనివాసరావు గురువారం ఉదయం గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలపడంతో విద్యాశాఖాధికారులు ఊపిరి పీల్చుకున్నారు. దీనిపై ఎంఈవో జీ.శ్రీనివాసరావును వివరణ కోరగా విద్యార్థులు అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరిన మాట నిజమేనని క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.



ఉందిగా సెప్టెంబరు మార్చిపైన అనుకోవద్దు..

- మార్చి 1 నుంచి పబ్లిక్ పరీక్షలు
- జిల్లాలో 41,300 మంది విద్యార్థులు
- భవితను నిర్ణయించే ఇంటర్
- మీ రాతను మార్చేది చేతిరాతే
- కష్టపడి చదివితే విజయం మీదే
- ప్రతి పరీక్షను ఇష్టంగా రాయండి
- తల్లిదండ్రులు సహకరించాల్సిందే
- పరీక్ష కేంద్రానికి ముందే వెళ్లాలి
- ఆర్టీసీ బస్‌లకు కలెక్టర్ ఆదేశం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఇంటర్మీడియెట్‌లో సాధించే మార్కులే భవిష్యత్తును నిర్ణయిస్తాయనడంలో సందేహం లేదు. ఇంటర్‌లో అశ్రద్ధ చేసి తర్వాత అనుకున్న విద్యను అభ్యసించలేక ప్రతి ఏడాదీ వేలాది మంది విద్యార్థులు వెనుకబడుతూ ఉంటారు. ఉదాహరణకు ఒక ఊరెళదామని ప్లాన్ చేసుకొని బస్టాండుకు వెళితే ఆ ఊరెళ్లే బస్సు ఎక్కి అనుకున్న గమ్యం చేరవచ్చు.అయితే ముందస్తు ప్లానింగ్ లేకపోతే అంతా అయోమయమే.చివరికి గమ్యం చేరే దారి కానరాక సందిగ్ధంలో పడిపోయే ప్రమాదం ఉంది. పరీక్షల విషయంలో కూడా ఒక పద్ధతి,ప్రణాళిక పాటిస్తే లక్ష్యం చేరడం పెద్ద కష్టమైన పనేమీ కాదన్నది పెద్దలు చెప్పిన మాట.ఇప్పటికే ప్రాక్టికల్స్ పరీక్షలు ముగిశాయి.వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల కోసం 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

సమయపాలన కీలకం

సమయం ఎప్పుడూ అత్యంత విలువైనదే. గడచిన క్షణాన్ని వెనక్కి రప్పించడం ఎవరి తరమూ కాదు. పరీక్షల వేళ సమయపాలన అనేది మరింత కీలకమైన భూమిక పోషిస్తుంది. ఒక్క నిమిషం కూడా భవిష్యత్తును నిర్ణయిస్తుందని గుర్తుంచుకోవాలి. కాలయాపన చేస్తే ఖచ్చితంగా ఆందోళన తప్పదు. సబ్జెక్టులు లేదా వాటిలో మిగిలిన పాఠాలు చూసి భయపడకూడదు. ప్రతి సబ్జెక్టుకూ నిర్దిష్ట సమయం కేటాయించుకుని తప్పనిసరిగా అనుసరించాలి. పరీక్షలకు ఇంకా ఎన్నో రోజుల సమయం లేదు కాబట్టి రివిజన్‌కి ప్రాధాన్యం ఇవ్వాలి.

మార్కులు తెచ్చే చేతిరాత..

పరీక్షలో చేతిరాతకూ ప్రాధాన్యం ఉంటుంది. జవాబు ఇష్టానుసారం రాసుకుపోతే ఆశించిన ఫలితం ఉండదు. రాసిన జవాబులో స్పష్టత కొరవడడంతో పేపర్లు దిద్దేటప్పుడు(మూల్యాంకనం) అధ్యాపకులకు ఇబ్బందిగా ఉంటుంది. దీంతో మార్కులు తగ్గే అవకాశం ఉండొచ్చు. అలాగే స్పెలింగ్ తప్పులు రాకుండా చూసుకోవాలి. ఫార్ములాలు, సూత్రాలు, ఈక్వేషన్లు వంటివి రాసేటప్పుడు, డయాగ్రాంలు వేసినప్పుడు కచ్చితంగా అర్థం అయ్యే రీతిలో ఉండాలి. సోషల్, బయాలజీ, లాంగ్వేజెస్ రాసేటప్పుడు సైడ్ హెడ్డింగ్‌తో రాస్తే మరింత మేలు.

పరీక్షా సమయంలో..

ముఖ్యంగా పరీక్ష కేంద్రం వద్దకు నిర్దిత సమయం కంటే అరగంట ముందుగానే చేరుకోవాలి. కాసేపు ప్రశాంతంగా కూర్చోవాలి. మానసికంగా ఎట్టి పరిస్థితుల్లోనూ ఒత్తిడి పడకూడదు. ఇది కష్టమైన సబ్జెక్టు అనే భావన మనసులోంచి తీసేయాలి. ప్రశ్నపత్రం అందుకున్న వెంటనే ఒకసారి పేపరు ప్రశాంతంగా పూర్తిగా చదువుకోవాలి. ఆన్సర్ షీటుపై హాల్ టికెట్ తదితర సమాచారాన్ని తప్పులు లేకుండా కరెక్టుగా రాయాలి.ప్రశ్నపత్రంలో బాగా జవాబు తెలిసిన వాటిని టిక్ పెట్టుకొని రాయడం ప్రారంభించాలి. తర్వాత కొద్దిగా జవాబు తెలిసిన వాటిని రాయాలి. చివరిగా సమయం ఉంటే మిగిలిన ప్రశ్నల జోలికి వెళ్లాలి.సమయాన్ని చూసుకుంటూ జవాబులు రాస్తుండాలి.ఒకే ప్రశ్నకు సమయాన్ని వృథా చేయకూడదు. ఒక ప్రణాళిక ప్రకారం పరీక్ష రాయాలి.రవాణా విషయంలో విద్యార్థులు ఒక్కోసారి ఇబ్బంది పడుతూ ఉంటారు. అలాంటి వారు తారసపడితే ద్విచక్ర వాహనం, ఆటో, కార్ల చోదకులు సహకరించి వారిని పరీక్ష కేంద్రాల వద్దకు చేర్చడం సామాజిక బాధ్యతగా గుర్తుంచుకోవాలి.

ఇంటి నుంచి ఇలా..

దారిలో ఇబ్బందులను ఎవరూ ఊహించలేరు. పరీక్ష కేంద్రానికి అరగంట ముందుగానే చేరుకొనే విధంగా సమయాన్ని అంచనా వేసుకొని ఇంటి నుంచి బయలుదేరాలి. హాల్‌టికెట్, ప్రభుత్వం చేత జారీ చేయబడిన ఆధార్ తదితర ఏదోక గుర్తింపు కార్డు, పరీక్ష రాయడానికి అవసరమైన పెన్నులు, పెన్సిలు, స్కేలు తదితర వస్తువులను ముందు రోజు రాత్రే సిద్ధం చేసుకొని గుర్తుగా ఒకచోట పెట్టుకోవాలి.పెన్నులు అప్పుడే కొన్నవి కాకుండా అలవాటుగా వాడే పెన్నులను సిద్ధం చేసుకోవాలి. ఒకటి అదనంగా ఉండేట్లు చూసుకోవాలి. పరీక్షకు ప్రిపేర్ అవుతూ నిద్రాహారాలను పట్టించుకోకపోతే మొదటికే మోసం వస్తుంది. అందువల్ల కనీసం 6-7 గంటలు నిద్ర ఉండేట్లు చూసుకోవాలి. సాత్వికాహారం తింటే మేలు. ధ్యానం, యోగాను కొద్ది నిమిషాల పాటు చేస్తే మెదడు మరింత చురుగ్గా పనిచేసే అవకాశం ఉంటుంది.టీవీ,సెల్‌ఫోన్ వంటి వాటితో సమయం వృథా కాకుండా చూడాలి. ఇంట్లో పరిస్థితులు పిల్లల మార్కులపై ప్రభావం చూపెడతాయి.తల్లిదండ్రులు పిల్లలను సాధ్య మైనంత వరకూ ప్రశాంతంగా ఉంచాలి. వారి అనుపా నువులు గమనిస్తూ ఏదైనా ఇబ్బంది ఉంటే సున్నితంగా గద్దించాలి.

సీసీ కెమెరాల నిఘాలో

పరీక్ష కేంద్రాల వద్ద మంచినీరు, అత్యవసర మెడిసిన్, నిరంతర విద్యుత్ సరఫరా తదితర అన్ని ఏర్పాట్లనూ చేస్తున్నారు.పరీక్షా సమయాలకు అనుగుణంగా ఆయా రూట్లలో ఆర్టీసీ బస్సులు నడపాలని కలెక్టర్ మాధవీలత ఇప్పటికే ఆదేశించారు. దివ్యాంగులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేశారు.సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణలో పరీక్షలు జరుగుతాయి.సిబ్బందితో సహా విద్యార్థులెవరూ ఎలక్ట్రానిక్ పరికరాలు,ఎలక్ట్రానిక్ వాచీలను ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించరు.పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షను అమల్లో ఉంటుంది.పోలీసులు బందోబస్తు నిర్వహిస్తారు.

డాట్స్ ఉంటే డయల్...

తూర్పుగోదావరిలో ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. 37,502 మంది మొదటి, రెండో సంవత్సర విద్యార్థులు పరీక్షలు రాయ నున్నారు. వీరిలో మొదటి ఏడాది 19,336, రెండో ఏడాది 18,166 మంది విద్యార్థులు ఉన్నారు. ఒకేషనల్‌కి సం బంధించి 3,802 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉం ది.విద్యార్థుల సందేహాల నివృత్తికి 94922 26232, 0883- 2473430 నెం బర్లను ఏర్పాటు చేశారు. కార్యాలయ వేళ ల్లో ఆ నెంబర్లకు ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. ఇన్విజిలేటర్లు, ఫ్లైయింగ్ స్క్వాడ్లు తదితర 1350 మంది సిబ్బంది పరీక్షల నిర్వహణలో పాల్గొనున్నారు.

ఇక ఆరు రోజులే గడువు..

మార్చి 1 నుంచి మొదటి ఏడాది, మార్చి 2వ తేదీ నుంచి రెండో ఏడాది విద్యార్థులకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్షలు నిర్వహి స్తారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాల వద్దకు ఉదయం 8.30 గంటల్లోగా చేరే విధంగా చూసుకోవాలి. మొదటి ఏడాది విద్యార్థులకు 1న సెకండ్ లాంగ్వేజీ, 4న ఇంగ్లీష్, 6న లెక్కలు-1ఏ, బోటనీ, సివిక్స్, 9న లెక్కలు-1బీ, జువాలజీ, హిస్టరీ, 12న ఫిజిక్స్, ఎకనామిక్స్, 14న కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ, ఫైన్ ఆర్ట్స్‌మ్యూజిక్, 16 పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్, బ్రిడ్జి కోర్సు మ్యాథ్స్(బైపీసీ విద్యార్థులకు), 19న మోడ రన్ లాంగ్వేజీ, జాగ్రఫీ పరీక్ష ఉంటుంది. రెండో ఏడాది విద్యార్థులకు మార్చి 2న సెకండ్ లాంగ్వేజీ, 5న ఇంగ్లీష్, 7న మ్యాథ్స్, బోటనీ, సివిక్స్, 11న మ్యాథ్స్, జువాలజీ, హిస్టరీ, 13న ఫిజిక్స్, ఎకనా మిక్స్, 15న కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ, ఫైన్ ఆర్ట్స్‌మ్యూజిక్, 18న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్, బ్రిడ్జి కోర్సు మ్యాథ్స్(బైపీసీ విద్యార్థులకు), 20న మోడరన్ లాంగ్వేజీ, జాగ్రఫీ పరీక్షలు నిర్వహిస్తారు.

ఒత్తిడికి గురికావొద్దు..



జంబ్లింగ్ విధానం వల్ల హాల్ టికెట్ తీసుకున్న తర్వాత పరీక్ష కేంద్రం ఎక్కడో ఓసారి సందర్శించాలి. పరీక్ష ఉన్న రోజున అరగంట ముందుగానే విద్యార్థి కేం ద్రం వద్దకు చేరేలా తల్లిదండ్రులు చూసుకోవాలి. ప్రశాం త వాతావరణంలో పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ చేశాం. విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్‌కి దూరంగా ఉండాలి. ఒత్తిడి పడకుండా మంచి మార్కులు వచ్చే విధంగా పరీ క్షలు రాయాలి. ఆల్ ది బెస్ట్. **- ఎన్ఎస్‌వీఎల్ నరసింహం, ఇంటర్ ప్రాంతీయ పర్యవేక్షకులు**

నేటి నుంచి ఇంటర్ హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థుల హాల్ టికెట్లను ఆయా కాలేజీల లాగిన్‌కి పంపించామని శుక్రవారం నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. విద్యార్థులు ఆయా కళాశాలల్లో హాల్‌టికెట్లు పొందాలని సూచించారు. హాల్ టికెట్లు పొందడం తదితర విషయాల్లో ఏదైనా ఇబ్బందులు ఎదురైనా, సందేహాల నివృత్తి కోసం 9492226232, 0883 2473430 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈ నెంబర్లు ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7గంటల వరకూ అందుబాటులో ఉంటాయన్నారు. గురువారం రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ఇంటర్ అధికారులతో కలిసి ఆమె పాల్గొన్నారు. 52 పరీక్షా కేంద్రాల్లో 41,304 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. వీరిలో 3,802 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారన్నారు. సమావేశంలో జోన్ 1,2 ఆర్జేడీ ఐ.శారద, ఆర్ఐవో నరశింహం తదితరులు పాల్గొన్నారు.





పండిత సదస్యం

అంతర్వేది, ఫిబ్రవరి 22: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలోని పురాతన కల్యాణ మండపం వద్ద గురువారం సాయంత్రం ఐదు గంటలకు నూతన వధూ వరులైన స్వామి, అమ్మవార్లను ప్రత్యేక సింహాసనంపై ఆశీనులు గావించి పండిత సదస్యం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి శ్రీనివాస్, స్థానాచార్యులు వింజమూరి రామ రంగాచార్యులు, వేద పండితుడు చింతా వెంకటశాస్త్రి, అర్చకస్వాముల సారథ్యంలో వేద మంత్రోచ్చారణల నడుమ స్వామి, అమ్మవార్లకు వేదాశీర్వచనం అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు వీక్షించి తన్మయత్వం పొందారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్, ఫ్యామిలీ ఫౌండర్ కలిదిండి కుమారరామగోపాలరాజాబహదూర్, సహాయ కమిషనరు వి.సత్యనారాయణ, వలవల రాంబాబు, పేరూరు వేద పండితులు పాల్గొన్నారు.



హనుమద్వాహనంపై ఊరేగుతున్న లక్ష్మీనరసింహుడు

వైభవంగా గ్రామోత్సవం

హనుమద్వాహనంపై ఊరేగిన స్వామి, అమ్మవారు

అంతర్వేది, ఫిబ్రవరి 22: అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఏడో రోజైన గురువారం సాయంత్రం అంతర్వేదిపాలెం వాస్తవ్యులు అల్లూరి వెంకట సత్యనారాయణరాజుచే నిర్మితమైన హనుమద్వాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరిగింది. తొలుత స్వామివారి వాహనశాల వద్ద నూతన వధూవరులైన స్వామి, అమ్మవార్లను వాహనంపై అధిష్ఠింపజేసి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం వాహన నిర్మాతలు, అధికారులు, అర్చకులు, భక్తులు కొబ్బరికాయలు కొట్టి గ్రామోత్సవంలో పాల్గొన్నారు. రాత్రి సింహ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. అర్చకస్వాముల ప్రత్యేక పూజల అనంతరం భక్తులు కొబ్బరికాయలు కొట్టి స్వామివారికి హారతులు ఇచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు వాహన సేవను చూసి తరించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్, ఫ్యామిలీ ఫౌండర్ కలిదిండి కుమారరామగోపాల రాజాబహదూర్, ఆలయ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ, వలవల రాంబాబు, ఎస్‌ఐ ఎస్.రాము, దాసరి వాసు, భక్తులు పాల్గొన్నారు.

వసంత మండపం ప్రారంభం

మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని చక్రస్నానం అనంతరం స్వామివారి తలార్చుకోవడానికి నూతన వసంత మండపాన్ని ఆలయ ఛైర్మన్, ఫ్యామిలీ ఫౌండర్ కలిదిండి కుమారరామగోపాల రాజాబహదూర్ ప్రారంభించారు. అంతకు ముందు పండితులు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం జరగబోయే చక్రస్నానానికి ఈ వసంత మండపం వద్ద స్వామివారు ఆశీనులు కానున్నట్టు ఆలయ ప్రధానార్చకుడు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్ తెలిపారు. కార్యక్రమంలో సఖినేటిపల్లి ఎస్‌ఐ ఎస్.రాము, ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్‌లు ఒడుగు శ్రీను, కొండా జాన్‌బాబు, ఎంపీటీసీ భైరా నాగరాజు, వాహనదారులు, భక్తులు పాల్గొన్నారు.

చక్రస్నానానికి ఏర్పాట్లు

శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సముద్ర స్నానాల ఘట్టం వద్ద స్వామివారి చక్రస్నానానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ తెలిపారు. మాఘ మాసం శనివారం అధిక సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలకు వస్తారని అంచనా వేస్తున్నారు. దీంతో బారికేడ్లు పెట్టి పూజలను భక్తులంతా తిలకించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.



వేదాశీర్వచనం అందిస్తున్న పండితులు

భీమేశ్వరునికి సదస్యం



పండిత సత్కారం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 22: ద్రాక్షారామ భీమేశ్వర స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి సదస్యం ఘనంగా జరిగింది. కల్యాణమూర్తులైన మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి, లక్ష్మీ సమేత నారాయణస్వామి, చండికా సమేత సూరేశ్వర స్వామిలను వేదికపై అధిష్ఠింపజేశారు. తొలుత అర్చకస్వాములు స్వామి, అమ్మవార్లకు సుగంధ ద్రవ్యాలను పూశారు. అనంతరం గణపతి పూజ, అష్టదిక్పాలక ఆవాహన, ముక్కోటి దేవతా ఆవాహన చేశారు. అనంతరం వేదస్వస్తి, స్వస్తి ప్రవచనం జరిపారు. ఆగమ పండితులు, వేద పండితులు, స్వస్తివాచకులు, అర్చకస్వాములు, పురోహితులను నూతన వస్త్రాలతో ఈవో పీటీవీ సత్యనారాయణ సత్కరించారు. నీరాజన మంత్రపుష్పాలతో సదస్యం పూర్తయ్యింది. భక్తులకు వడపప్పు, పానకం పంపిణీ చేశారు. అనంతరం సమస్త వాహనాలపై స్వామివారి గ్రామోత్సవం జరిగింది.

వాడపల్లి వెంకన్న హుండీ ఆదాయం రూ.91.05 లక్షలు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

ఆత్రేయపురం, ఫిబ్రవరి 22: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోని హుండీలను దేవదాయ శాఖ పర్యవేక్షణాధికారులు డి.నాగమల్లేశ్వరరావు, ఎం.రాధాకృష్ణ, బి.కిరణ్, నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో గురువారం తెరిచి లెక్కించారు. 29 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.69,95,492, అన్నప్రసాద హుండీల ద్వారా రూ21,09,881... మొత్తం రూ.91,05,373 ఆదాయం లభించింది. బంగారం 57 గ్రాములు, వెండి 900 గ్రాములు, పలు దేశాల కరెన్సీ లభించినట్టు ఆలయ ఛైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు. క్షేత్ర పాలకుడు అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి హుండీల ఆదాయం రూ.1,55,674 లభించింది. లెక్కింపులో ధర్మకర్తల మండలి సభ్యులు మన్యం సూర్యకుమారి భాను, శనగన సత్యనారాయణ, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

సిద్ధి వినాయక ఆలయ హుండీల ఆదాయం రూ.27.20 లక్షలు

అయినవిల్లి, ఫిబ్రవరి 22: అయినవిల్లి శ్రీసిద్ధివినాయక స్వామి ఆలయ హుండీలను గురువారం తెరిచి లెక్కించారు. 56 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.26,22,100, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.98,061... మొత్తం రూ.27.20 లక్షలు వచ్చిందని ఈవో ముదునూరి సత్యనారాయణరాజు చెప్పారు. 3.3 గ్రాముల బంగారం, 527 గ్రాముల వెండితో పాటు 21 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చాయి. పర్యవేక్షణాధికారిగా అమలాపురం తనిఖీదారు జంపా రామలింగేశ్వరరావు వ్యవహరించారు. ఆలయ ఛైర్మన్ గుత్తుల నాగబాబు, ధర్మకర్తలు, అర్చకులు, దేవస్థానం సిబ్బంది, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముక్తేశ్వరం బ్రాంచి సిబ్బంది పాల్గొన్నారు.

వంజరాల వేటతో సందడి



ఉప్పాడ(కొత్తపల్లి) ఫిబ్రవరి 22: ఉప్పాడ తీరంలో వంజరం చేపల వేటతో సందడి నెలకొంది. గురువారం ఉప్పాడ తీరం నుంచి వేటకు వెళ్లిన మత్స్యకారులకు విరివిగా వంజరాలు దొరికాయి. గత రెండు రోజులు నుంచి తీరంలో మత్స్య సంపద దొరకడంతో మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తీరంలో వంజరాల వేటతో సుమారు రూ.20 లక్షల ఆదాయం వచ్చినట్టు సమాచారం.

విద్యార్థుల సమక్షంలో సరస్వతి పూజ

● రత్నగిరిపై ఘనంగా ఏర్పాట్లు ● పెన్నులు అందించిన ఈవో



సరస్వతి పూజ నిర్వహిస్తున్న పండితులు



పూజకు హాజరైన విద్యార్థులు

అన్నవరం, ఫిబ్రవరి 22: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో గురువారం ఉచిత సామూహిక సరస్వతి పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం 9 గంటలకు నిత్య కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను, సరస్వతి దేవిని పండితులు ఆశీనులు గావించగా ఈవో రామచంద్రమోహన్ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే అర్చక స్వాములు సత్యదేవుడు, సరస్వతీదేవిల అష్టోత్తర శతనామ పూజలు నిర్వహించారు. అనంతరం సరస్వతీదేవి చెంత ఉంచిన కలములు, రక్షలను విద్యార్థులకు పండితులు మంత్రపూర్వకంగా అందించారు. పదో తరగతి, ఇంటర్ తదితర పరీక్షలు, పోటీ పరీక్షలకు హాజరయ్యేవారికి ప్రతీఏటా దేవస్థానం తరుపున సామూహిక సరస్వతి పూజను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కార్యక్రమం అనంతరం చతుర్వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. పూజలో పాల్గొన్న విద్యార్థులకు స్వామివారి ప్రత్యేక దర్శనం, ఉచిత అన్నప్రసాదాన్ని అందజేశారు.

నూతన రథంపై ప్రాకార సేవ



అన్నవరం, ఫిబ్రవరి 22: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి గురువారం నూతన రథంపై ప్రాకార సేవ నిర్వహించారు. పర్వదినాలలో స్వామివారికి వెండిరథంపై ఊరేగింపు నిర్వహించేవారు. ఆ రథం పాతదై పోవడంతో ముందు జాగ్రత్త చర్యగా పూర్వపు ఈవో ఆజాద్ రూ.38 లక్షల వ్యయంతో టేకు రథం చేయించాలని ప్రతిపాదించి పనులు ప్రారంభించారు. రథం తయారీ పూర్తికావడంతో గురువారం ఈవో రామచంద్రమోహన్ దంపతులు రథాన్ని ప్రారంభించారు. అనంతరం రథంపై స్వామి,అమ్మవార్లు ఆలయ ప్రాకారం చుట్టూ విహరించారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, చామర్తి కన్నబాబు, ఇంద్రగంటి సుధీర్, పాలంకి పట్టాభి ముత్య వెంకట్రావు, పాలక మండలి సభ్యులు పేరూరి బద్రీనారాయణ పీఆర్వో కృష్ణారావు, సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్ పాల్గొన్నారు.

చొప్పెల్లలో వివాహిత హత్య

వివాహేతర సంబంధమే కారణమని అనుమానాలు



కుమారి(ఫైల్)



ఆలమూరు, ఫిబ్రవరి 22: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చొప్పెల్లలో వివాహిత సలాది మరియకుమారి (30) హత్యకు గురైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...చొప్పెల్ల గ్రామంలో నివాసముంటున్న సలాది మరియకుమారి, బిక్కవోలు మండలం మెళ్లూరుకు చెందిన అవివాహితుడైన చల్లా దుర్గానాగప్రసన్నకుమార్ మధ్య రెండేళ్లుగా వివాహేతర సంబంధం ఉంది. మరియకుమారికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రసన్నకుమార్ తన అక్క, బావలకు చెందిన ఇటుక బట్టీ నిర్వహిస్తున్నారు. అందులో కుమారి భర్త సలాది శివసూర్యనారాయణ కూలీగా పనిచేస్తున్నాడు. దీంతో వారిద్దరి మధ్య సంబంధం కొనసాగుతోందని భర్త పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇటీవల మరియకుమారి మరొకరితో చనువుగా ఉంటోంది. ఈ విషయమై కొద్ది రోజులుగా వివాదం జరుగుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం ప్రసన్నకుమార్ మరియకుమారిని బలంగా కొట్టి చంపేసినట్టు భావిస్తున్నారు. కొద్దిసేపటి తర్వాత మరియకుమారి ఉరేసుకుని చనిపోయిందంటూ ప్రసన్నకుమార్ కొందరిని తీసుకెళ్లి చూపించినట్టు చెప్తున్నారు. కోపంతో బలంగా కొట్టడంతో కిందపడి చనిపోయిందని ప్రసన్నకుమార్ తమ విచారణలో చెప్పా డని రూరల్ సీఐ రామ్‌కుమార్ తెలిపారు. నిందితుడు ఆలమూరు తహసీల్దారు గోపాలకృష్ణ ఎదుట లొంగి పోయాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఆలమూరు ఎస్‌ఐ శ్రీనునాయక్ చెప్పారు.

జనసేన పార్టీకే నా సపోర్టు

కుటుంబీకులు ఆదేశిస్తే బాబాయి తరపున ప్రచారం

ఆపరేషన్ వాలంటైన్ సినిమా ప్రమోషన్‌లో సినీ హీరో వరుణ్‌తేజ్



రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 22 : 'బాబాయి పవన్ కల్యాణ్ జనసేన పార్టీ ద్వారా నిజాయితీగా రాజకీయాలు చేస్తున్నారు. ఆయన చేస్తున్న పోరాటంపై మాకు నమ్మకం ఉంది. నా సపోర్టు జనసేన పార్టీకే ఉంటుంది' అని సినీ హీరో వరుణ్‌తేజ్ అన్నారు. ఆయన హీరోగా నటించిన ఆపరేషన్ వాలంటైన్ సినిమా ప్రమోషన్‌లో భాగంగా గురువారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం విచ్చేసి మీడియాతో మాట్లాడారు. రాజకీయాలపై మీడియా అడిగిన ప్రశ్నలకు ఆయన బదులిస్తూ తన కుటుంబ సభ్యులు అనుమతిస్తే వచ్చే ఎన్నికల్లో బాబాయి పవన్ కల్యాణ్ తరపున జనసేన పార్టీ కోసం ఎన్నికల్లో ప్రచారం చేస్తానని వెల్లడించారు. పవన్ కల్యాణ్ సిద్ధాంతాలు, ఆయన ఎంచుకునే మార్గాలపై నమ్మకం ఉందని స్పష్టం చేశారు. బాబాయితో కలసి నటించడం ఇష్టమే అయినా ప్రస్తుతం అలాంటి కథలేవీ లేవన్నారు. పుల్వామా ఘటనల నేపథ్యంలో దర్శకుడు సినిమాను తెరకెక్కించారని, మార్చి 1 సినిమా ప్రేక్షకుల ముందుకు రానుందని తెలిపారు.

మంత్రి సాక్షిగా వైసీపీ నాయకుల ఘర్షణ

కడియం, ఫిబ్రవరి 22: సాక్షాత్తు మంత్రి సమక్షంలో వైసీపీ నాయకులు బాహాబాహీకి దిగారు. కడియం ఉన్నత పాఠశాలలో గురువారం వలంటీర్లకు వందనం కార్యక్రమం జరిగింది. మంత్రి వేణుగోపాలకృష్ణ వలంటీర్లకు పురస్కారాలు అందజేశారు. అయితే ఫొటోలు తీసే సమయంలో ముందుండాలనే విషయంపై మండల వ్యవసాయ సలహా సంఘం ఛైర్మన్ ఈలి గోపాలం, వైసీపీ జేసీఎస్ కన్వీనర్ తాడాల చక్రవర్తిలకు మధ్య వాగ్వాదం జరిగింది. మంత్రి, ప్రజాప్రతినిధులు, అధికారులు సమక్షంలో ఘర్షణకు దిగారు. ఈ సంఘటనతో మంత్రి వేణు కొంత అసహనానికి గురయ్యారు. ఇద్దరినీ విడదీసే ప్రయత్నం చేసినా వారు లెక్కచేయక పోవడంతో అక్కడే ఉన్న పోలీసులు గొడవ పెరగడకుండా చూశారు. కాగా కొంతకాలం నుంచి చక్రవర్తి, గోపాలం మధ్య విభేదాలున్నాయి.

రేపటి నుంచి అంతర్ జిల్లాల ఖోఖో పోటీలు

సామర్లకోట జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాట్లు



క్రీడా మైదానంలో ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

సామర్లకోట, ఫిబ్రవరి 22: సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈ నెల 24 నుంచి 26 వరకూ మూడు రోజుల పాటు 56వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల సీనియర్స్ ఖో-ఖో చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల ఖోఖో సంఘం కార్యదర్శి, పోటీల నిర్వాహణ కార్యదర్శి కె.పట్టాభిరామం తెలిపారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ జాన్ మోజెస్‌తో కలిసి గురువారం సాయంత్రం కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టాభిరామం మాట్లాడుతూ మూడు రోజుల పాటు సీనియర్స్ పురుషులు, మహిళల విభాగాల్లో డే అండ్ నైట్ ఫ్లడ్‌లైట్ల వెలుగులో పోటీలు నిర్వహించనున్నామని చెప్పారు. రాష్ట్రంలో 13 జిల్లాల క్రీడాకారులతో పాటు ఏపీ ఉద్యోగ సంఘం కూడా పోటీలలో పాల్గొంటోందన్నారు. ఈ పోటీలలో అత్యంత ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర పురుషుల, మహిళల జట్లకు ఎంపిక చేసి ఆంధ్ర రాష్ట్రం తరపున మార్చి 27 నుంచి ఏప్రిల్ 2 వరకూ న్యూఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి ఖోఖో క్రీడా పోటీలకు ఎంపిక చేస్తామని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి హాజరయ్యే క్రీడాకారులకు భోజన, వసతి సదుపాయాలు కళాశాల మైదానంలో ఏర్పాటు చేస్తున్నామని జాన్‌మోజెస్ తెలిపారు. పాలిక చంటి, కెన్నడీ తదితరులు పాల్గొన్నారు.

25న ఉభయ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ పోటీలు



ట్రోఫీలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 22: అమలాపురంలోని డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు ఆరోగ్య ఉద్యానవనంలో 2వ వార్డు కౌన్సిలర్ ఆశెట్టి నాగదుర్గ-ఆదిబాబు దంపతుల నేతృత్వంలో పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల పవర్‌లిఫ్టింగ్, బెంచ్‌ప్రెస్-2024 పోటీలను ఈ నెల 25న నిర్వహిస్తున్నట్టు జిమ్ కోచ్ కంకిపాటి.వెంకటేశ్వరరావు తెలిపారు. అమలాపురం హెల్త్-ఫిట్‌నెస్ జిమ్‌లో ట్రోఫీలను అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు, ప్రధాన కార్యదర్శి వంటెద్దు వెంకన్నాయుడు గురువారం ఆవిష్కరించారు. కోనసీమ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్, హెల్త్-ఫిట్‌నెస్ జిమ్ ఆధ్వర్యంలో జరిగే పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఇప్పటికే వంద మందికిపైగా క్రీడాకారులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు నగభేరి కృష్ణమూర్తి, సభ్యులు దొమ్మేటి వెంకటరమణ, మట్టపర్తి వెంకటసముద్రం, చిక్కం రాజబాబు, పొణకల దుర్గాప్రసాద్, నార్ని శ్రీను, చీకురుమెల్లి కిరణ్‌కుమార్, సంసాని సోమశేఖర్, కరాటం రవిసుధీర్ పాల్గొన్నారు.

అధికారుల తీరుపై మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి నిరసన

కలెక్టరేట్‌లో బైఠాయింపు



నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 22: తూర్పుగోదావరి జిల్లా కలెక్టరేట్‌లో అధికారుల తీరును నిరసిస్తూ అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ మాధవీలతను కలిసి అనపర్తి నియోజకవర్గం పరిధిలో జరుగుతున్న ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదు చేసేందుకు గురువారం కలెక్టరేట్‌కు వచ్చారు. అయితే కలెక్టర్, జేసీ, డీఆర్‌వో అందుబాటులో లేకపోయినా చాంబర్ చాంబర్‌కు తిప్పడంతో అధికారుల తీరుపై మండిపడ్డారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అనేక చోట్ల అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేయడానికి జిల్లా కలెక్టరేట్‌కు మధ్యాహ్నం వచ్చామన్నారు. కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో క్యాంప్ ఆఫీస్‌లో ఉన్నారని చెప్పడంతో జాయింట్ కలెక్టర్ కోసం చూశామన్నారు. అయితే ఆయన ట్రైనింగ్‌లో ఉన్నారని చెప్పారన్నారు దీంతో డీఆర్‌వో కోసం చూస్తే అక్కడ ఆయన కార్యాలయానికి తాళం వేసి ఉందన్నారు. ఇలా 45 నిమిషాల పాటు అన్ని చాంబర్లు తిరిగినా ఎవ్వరు పట్టించుకోలేదన్నారు. దీంతో అధికారుల తీరుకు బైఠాయించి నిరసన తెలిపామన్నారు. అప్పుడు ఒక అధికారి వచ్చి వినతి తీసుకున్నారన్నారు. బదిలీ అయ్యివెళ్లిన పోసిబాబు అనే తహశీల్దార్ తిరిగి అనపర్తి వచ్చి డమ్మీ పట్టాలపై సంతకం చేయడం, అలాగే జరగని భూసేకరణ జరిగినట్లు చెబుతూ గ్రామాల్లో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది రెవెన్యూ అధికారులు కలిసి డమ్మీ పట్టాలు పంపిణీ చేయడంపై ఫిర్యాదు చేయడానికి వస్తే ఇక్కడ పట్టించుకునే వారే లేరన్నారు. దీనిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆక్వా చెరువుల వద్ద మోటార్ల చోరీ

అల్లవరం, ఫిబ్రవరి 22: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలంలోని డి.రావులపాలెం, తాడికోన, కొమరగిరిపట్నం గ్రామాల్లో ఆక్వా చెరువుల వద్ద మోటార్ల ఇంజన్లు దొంగలపాలయ్యాయి. డి.రావులపాలెంలో మోటార్ ఇంజన్‌ను అపహరిస్తున్న దొంగను రైతు బొబ్బిలి శ్రీను పట్టుకుని పోలీసులకు అప్పగించినట్టు సమాచారం. డి.రావులపాలెంలో తన చెరువు వద్ద మోటారు ఇంజన్ చోరీకి గురైందని తిక్కా శ్రీరామమూర్తి అల్లవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గడిచిన ఏడాది కాలంలో అల్లవరం మండలంలో సుమారు 70కిపైగా మోటార్ ఇంజన్లు దొంగతనాలకు గురయ్యాయి. దొంగతనాలకు పాల్పడుతున్న వారిని, వాటిని కొనుగోలు చేస్తున్నవారిని కఠినంగా శిక్షించాలని బాధితులు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
JOBS
కాకినాడ, సర్పవరం జంక్షన్ దగ్గర ఫుడ్ సెంటర్ నందు వంట మాస్టర్స్ వెజ్ & నాన్ వెజ్, హెల్పర్స్, గుమస్తాలు, జ్యూస్ & చెరుకు రసం చేయుటకు జంట్స్, ఆటో డ్రైవర్స్ కావలెను. సెల్ : 99493 43008. Ajd:37

4 Lines CLASSIFIED Rs.230/- Only

ఏజెన్సీ సమాచారం

27న మెగా జాబ్‌మేళా


బ్రోచర్ విడుదల చేస్తున్న ఐటీడీఏ పీవో చైతన్య

చింతూరు, ఫిబ్రవరి 22 : చింతూరులో ఈ నెల 27న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నటు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య తెలిపారు. విలేకరులతో గురువారం అయన మాట్లాడుతూ జాబ్ మేళాలో మదర్, ఫాదర్ కేర్ హోం నర్సింగ్ సర్వీసెస్, ముత్తూట్ ఫైనాన్స్, మెడ్ ప్లస్ ఫార్మసీ, అపోలో ఫార్మసీ, వరుణ్ మోటార్స్ పేటియం, నవత రోడ్ ట్రాన్స్‌పోర్టు, ఆస్ట్రో టెక్ స్టీల్ తదితర మొత్తం పది నుంచి పదమూడు కంపెనీల వరకు పాల్గొననున్నట్లు పీవో తెలిపారు. ఈ అవకాశాన్ని చింతూరు డివిజనులోని 18 నుంచి 35 ఏళ్ల వయస్సు వరకు ఉన్న ఇంటర్ మీడియట్ ఆపై చదివిన నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని పీవో కోరారు. ఎర్రంపేటలోని ఏపీఆర్ బాలుర పాఠశాల ప్రాంగణంలో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు చెప్పారు. రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు వేతనాలు పొందే అవకాశం ఉందన్నారు. చింతూరు ఐటీడీఏ, ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థ సంయుక్తంగా ఈ జాబ్‌మేళా నిర్వహిస్తోందన్నారు. అభ్యర్థులు తమ ఆధార్ కార్డు, సర్టిఫికెట్ల జిరాక్సులతో హాజరు కావాలని సూచించారు. ఒక అభ్యర్థి ఒకటి నుంచి రెండు మూడు కంపెనీలలో దరఖాస్తు చేసుకోవచ్చని, చివరకు అతడికి నచ్చిన లేదా ఎంపికైన కంపెనీలో ఉద్యోగం పొందవచ్చన్నారు. ఇంటర్వ్యూలలో ఎంపికైన అభ్యర్థులు ఆయా కంపెనీలలో జాయిన్ అయ్యేంత వరకు ఐటీడీఏ చొరవ తీసుకుంటుందన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై సదస్సు


అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వరరామచంద్రాపురం, ఫిబ్రవరి 22: బాల్య వివాహాల నిర్మూలనపై గురువారం తహశీల్దార్ సయ్యద్ మౌలానాఫాజిల్ అధ్యక్షతన రేఖపల్లి ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో అవగాహన కార్య క్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించినా, జరిపించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఫణీందర్‌రెడ్డి, హెచ్.విక్టర్ చర్చి పాస్టర్లు, ముస్లిం పెద్దలు, పురోహితులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎస్ఐ సాయం

మోతుగూడెం, ఫిబ్రవరి22: చింతూరు మండలం మోతుగూడెం పరిధి మల్లవరం గ్రామానికి చెందిన రామదాసు అనే గిరిజనుడు ఈనెల 12న కల్లు చెట్టుపై నుంచి జారిపడడంతో మృతి చెందాడు. దీంతో అతని కుటుంబానికి మోతుగూడెం ఎస్ఐ జి.గోపాలరావు రూ.11 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో చింతా వికాస్ సుధాకర్, మల్లవరం గ్రామస్థులు, హెడ్ కానిస్టేబుల్ రమేష్ పాల్గొన్నారు.

'కూనవరం అటవీశాఖాధికారిపై చర్యలు తీసుకోవాలి'

కూనవరం, ఫిబ్రవరి 22: కూనవరం అటవీశాఖాధికారిణి మోహిని విజయలక్ష్మి అక్రమాలపై చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాయం వెంకయ్య అన్నారు. మోహిని విజయలక్ష్మి ఈనెల 15న సుమారు రూ.5 లక్షలు విలువ చేసే టేకు వస్తువులను అక్రమంగా తరలించారని ఆరోపించారు. దీనిపై సీసీ టీవీల ఫుటేజ్‌లు ఉన్నాయన్నారు. కూనవరానికి చెందిన ఓ లారీలో ఈ కలపను తరలించారన్నారు. నెల్లిపాక చెక్‌పోస్టు వద్ద ఎటువంటి చర్యలు తీసుకోకపోగా తెలంగాణలోని భద్రాచలం చెక్‌పోస్టు వద్ద ఈ లారీని ఆపినప్పటికీ బేరసారాలు చేసి కలపను తరలించారని చెప్పారు. అటవీశాఖాధికారికి స్థానిక అటవీ సిబ్బంది పూర్తిగా సహకరించి ఈ కలపను తిరువూరుకు తరలించినట్లు చెప్పారు. గతంలో సైతం ఈమెపై ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోలేదన్నారు.

పాపికొండల విహారానికి బోట్లు

దేవీపట్నం,ఫిబ్రవరి 22: పాపికొండలు అందాలు తిలకించేందుకు ప్రకృతి ప్రేమికులు పాపికొండలు విహార యాత్రకు వెళ్లారు. పోశమ్మ గండి బోట్ పాయింట్ నుంచి పూడిపల్లి, దేవీపట్నం, కచ్చులూరు, గొల్లూరు, మంటూరు, కొండమొదలు తదితర గోదావరి పరివాహక ముంపు ప్రాంతాల మీదుగా మూడు బోట్లలో సుమారు 120 మంది పర్యాటకులు పాపికొండలు వెళ్లారు.

అమ్మవారి ఆలయాన్ని వీడిన గోదావరి

గోదావరి ఒడ్డున ఉన్న మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారి ఆలయం గత ఎనిమిది నెలల నుంచి వరద నీటిలోని ఉండిపోయింది. గత రెండు రోజుల నుంచి అమ్మవారి ఆలయం వద్ద నీటి మట్టం తగ్గింది. వరద నీరు తగ్గడంతో అధికారులు ఆదేశాలిస్తే అమ్మవారి దర్శనం కల్పించేందుకు అవకాశాలు ఉంటాయి.

నష్ట పరిహారం చెల్లించాలని జాతీయ రహదారిపై ధర్నా


ఆందోళనకారులతో మాట్లాడుతున్న పోలీసులు


ఆందోళన నిర్వహిస్తున్న జడ్డంగి వాసులు

రాజవొమ్మంగి ఫిబ్రవరి 22: జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఇళ్లు, షాపులు కూల్చి వేసి నేటికీ నష్టపరిహారం ఇవ్వకపోవడంతో గురువారం జడ్డంగి గ్రామంలో జాతీయ రహదారిపై గ్రామస్థులు నిరసన చేపట్టారు. జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించి వాహన రాకపోకలను నిలిపివేశారు. జాతీయ రహదారి నిర్మాణానికి మెటీరియల్ తీసుకెళ్లే లారీలు, వాహనాలు మినహా మిగిలిన వాహనాలకు దారి ఇచ్చారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ నష్ట పరిహారం చెల్లించాలంటూ సబ్ కలెక్టర్,ఐటీడీఏ పీవో, జిల్లా కలెక్టర్‌కు ఎన్నిసార్లు తమ సమస్యలు చెప్పుకున్నా ఫలితం లేకపోవడంతో జాతీయ రహదారి నిర్మాణ వాహనాలను అడ్డుకున్నామని అన్నారు. పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో కాసేపు ఉద్రిక్త వాతవరణం చోటుచేసుకొంది. రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయం డిప్యూటీ తహశీల్దార్ శ్రీధర్ జడ్డంగి వచ్చి 20 రోజులలో నష్టపరిహారం అందేలా చర్యలు చేపడుతున్నామని గ్రామస్థులకు సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. తహశీల్దార్ సత్యనారాయణ, డిప్యూటీ తహశీల్దార్ అల్లు సత్యనారాయణ, సీఐ సన్యాసినాయుడు, గ్రామ పెద్దలు సింగిరెడ్డి రామకృష్ణ, గణజాల తాతారావు, సర్పంచ్ కొంగర మురళీకృష్ణ, జడ్పీటీసీ వడుగుల జ్యోతి తదితరులు ఉన్నారు.

25న రాజమండ్రి బ్రీడ్స్ డాగ్ షో

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 22: రాజమహేంద్రవరం దారా గ్రౌండ్స్‌లో ఈ నెల 25న జంతుప్రేమికులు కోసం తొలిసారిగా రాజమండ్రి బ్రీడ్స్ డాగ్ షో చాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈనెల 24 సాయంత్రం 5 గంటల వరకు రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించామన్నారు. రిజిస్ట్రేషన్లకు 85558 45656, 85008 45656, 79818 88191 నెంబర్లను సంప్రదించాలన్నారు.

జిల్లాలో 109 టీబీ ముక్త్ పంచాయతీలు

- సీతానగరం మండలంలో 12 గుర్తింపు
- లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నివారణా అధికారి డాక్టర్ వసుంధర


మిర్తిపాడు పంచాయతీ వద్ద హెల్త్ సిబ్బందితో డాక్టర్ వసుంధర

సీతానగరం, ఫిబ్రవరి 22: ప్రధాన మంత్రి టీబీ ముక్త్ పంచాయతీలుగా జిల్లాలో 109 పంచాయతీలను గుర్తించగా సీతానగరం మండలంలో 12 పంచాయతీలను గుర్తించినట్టు లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నివారణ ఆఫీసర్ డాక్టర్ వసుంధర తెలిపారు. గురువారం ఆమె మిర్తిపాడు పంచాయతీ పరిధిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాన మంత్రి టీబీ ముక్త్ పంచాయతీలంటే.. ఏ పంచాయతీలోనైతే ఒక సంవత్సరంలో 1000 జనాభాలో 30 మంది క్షయ అనుమానితులను గుర్తించి వారందరికి క్షయ పరీక్షలు జరిపి వారిలో 0 నుంచి 1కేసులు మించకుండా పాజిటివ్‌గా నిర్ధారించబడతారో, వారు పూర్తిగా మందులు వాడతారో ఆ పంచాయతీలను టీబీ ముక్త్ పంచాతీలుగా గుర్తిస్తారన్నారు. ఈ మేరకు జిల్లాలో 109 పంచాయతీలను గుర్తించగా సీతానగరం మండలంలో 12 పంచాయతీలను గుర్తించారన్నారు. మిర్తిపాడు గ్రామంలో జరుగుతున్న కార్యక్రమాలు, రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. పీహెచ్‌సీ వైద్యులను ఎంఎల్‌హెచ్‌పీ, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్లు దివ్య చైతన్య, మేఘన, ఎంపీహెచ్‌ఈఏ యర్రా సుబ్బారాయుడు, టీబీ సూపర్‌వైజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అనపర్తి ఎమ్మెల్యే అవినీతిపై బహిరంగ లేఖ


కరపత్రాలు పంచుతూ ఎమ్మెల్యే ఆసుపత్రి నుంచి బయటకొస్తున్న రామకృష్ణారెడ్డి

- చర్చకైనా.. సత్యప్రమాణానికైనా.. నేను సిద్ధం
- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి సవాల్
- ఎమ్మెల్యే అవినీతిపై ముద్రించిన కరపత్రాల పంపిణీ

అనపర్తి, ఫిబ్రవరి 22: గడచిన నాలుగున్నరేళ్లలో అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి చేసిన రూ.500 కోట్ల అవినీతిపై చర్చకైనా, సత్య ప్రమాణికైనా తాను సిద్ధమని.. మీరు సిద్ధమా అంటూ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఎమ్మెల్యేకు బహిరంగ లేఖ రాసారు. సదరు లేఖను కరపత్రాల ద్వారా ముద్రించి గురువారం ఆయన ప్రజలకు పంపిణీ చేశారు. ఇటీవల కాలంలో ఎమ్మెల్యే చేస్తున్న ఆరోపణలపై స్పందించిన రామకృష్ణారెడ్డి తనపై వచ్చిన ఆరోపణలు, తాను ఎమ్మెల్యేపై చేసిన ఆరోపణలు వివరిస్తూ ప్రజలకు బహిరంగ లేఖ రాసారు. ఈ లేఖలో తనపై వచ్చిన ఆరోపణులు తాను చేస్తున్న ఆరోపణలపైనా ప్రజల్లోనే చర్చించుకుందామని అంతకూ కాకుంటే మీకు(ఎమ్మెల్యే) ఇష్టమైన సత్యప్రమాణానికి కూడా సిద్ధమని మీరు దీనికి సిద్ధమైతే వెంటనే స్పందించాలంటూ ఆయన బహిరంగ లేఖలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి రాసిన బహిరంగ లేఖను కరపత్రాలుగా ప్రచురించి గురువారం అనపర్తిలో ఆయనే స్వయంగా పంపిణీ చేస్తూ ప్రజల్లోకి వెళ్లారు. స్థానిక దేవీచౌక్ నుంచి మెయిన్ రోడ్డు, గాంధీబొమ్మ, రైల్వేస్టేషన్ వరకు కరపత్రాలను పంచుతూ తిరిగి దేవీచౌక్‌కు చేరుకుని బస్టాండ్‌లో ప్రయాణీకులకు కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మెయిన్‌రోడ్డులో ఉన్న ఎమ్మెల్యేకు చెందిన గంగిరెడ్డి నర్సింగ్ హోమ్‌లోకి వెళ్లి అక్కడ ఆసుపత్రి, మందుల షాపు సిబ్బందికి కూడా కరపత్రాలను పంపిణీ చేశారు. విషయం తెలుసుకున్న వైసీపీ శ్రేణులు అక్కడికి చేరుకున్నారు. దీంతో కొద్దిసేపు గాంధీబొమ్మ సెంటర్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యే చేసిన అవినీతిని సాక్ష్యాధారాలతో సహా ఎప్పటికప్పుడు మీడియా పరంగా వివరిస్తూనే ఉన్నానని దీనికి ఆయన ఏనాడూ సమాధానం చెప్పలేదని ఇప్పటికైనా సరే.. చర్చకైనా, సత్యప్రమాణానికైనా వచ్చి తన సచ్ఛీలతను నిరూపించుకోవాలన్నారు. ఎమ్మెల్యే అవినీతిని ప్రజలకు వివరించాలనే బహిరంగ లేఖను రాసినట్టు రామకృష్ణారెడ్డి చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, మల్లిడి కృష్ణారెడ్డి, రామ భాస్కరరెడ్డి, తేనెల శ్రీనివాస్, కర్రి వెంకటరామారెడ్డి, దత్తుడు శ్రీను పాల్గొన్నారు.

ప్రధాని మోదీ రాజీనామా చేయాలి

- ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు జనిపల్లి సత్తిబాబు
- హరియాణాలో రైతులపై కాల్పులకు నిరసన

రాజానగరం, ఫిబ్రవరి 22: రైతాంగంపై కాల్పులు జరపడాన్ని అఖిల భారత రైతుకూలీ సంఘం(ఏఐకేఎంఎస్) తీవ్రంగా ఖండించింది. బీజేపీ ప్రభుత్వం బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్రమోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జనిపల్లి సత్తిబాబు, పి.వెంకట్‌నాయుడు గురువారం మాట్లాడుతూ పంజాబ్-హరియాణా బోర్డర్‌లో రైతులపై కాల్పులు జరిపి ఒక యువ రైతును కాల్చి చంపడంతో పాటు 50మంది రైతులను బుల్లెట్లతో గాయపర్చడాన్ని ఏఐకేఎంఎస్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. దేశానికి అన్నం పెడుతూ వ్యవసాయంలో నష్టాల్లో కూరుకుపోతూ దిక్కుతోచని స్థితిలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. రైతులు ఏళ్ల తరబడి రోడ్డుపైనే నిరసన తెలియజేస్తున్నా పట్టించుకోని బీజేపీ ప్రభుత్వం వారిపై తుపాకీ తూటల వర్షాన్ని కురిపించి రైతులను పొట్టన పెట్టుకోవడం విచారకరమన్నారు. వ్యవసాయానికి గిట్టుబాటు ధరలు కల్పించాలని వ్యవసాయ రంగాన్ని కాపాడమని రైతాంగం శాంతియుతంగా పోరాడుతుంటే మోదీ ప్రభుత్వం సదరు రైతులపై కాల్పులు జరపడం యావత్ భారతదేశం ఖండించాలని పిలుపునిచ్చారు. గతంలో ఢిల్లీలో రైతుల ఆందోళన సందర్భంగా మోదీ రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చని బీజేపీ ప్రభుత్వం ఈరోజు రైతులను కాల్చి చంపడం ఎంతవరకు సమంజసమో భారతదేశ ప్రజలు చూస్తున్నారన్నారు.

హరియాణా ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి: ఆకుల



రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 22: హరియాణా ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆకుల వెంకటరమణ డిమాండ్ చేశారు. మండలంలోని బొమ్మూరు ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. హరియాణా, పంజాబ్ సరిహద్దుల్లో హరియాణాకు చెందిన 24 ఏళ్ల రైతు శుభకరన్ సింగ్‌ను దారుణంగా పోలీసులు కాల్చిచంపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పోలీసులపై చర్యలు తీసుకోవాలని, సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు, ఐఎఫ్‌టీయూ నాయకులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశంలో అనధికార వ్యక్తుల ప్రసంగాలపై డీఎల్‌డీవో విచారణ

బిక్కవోలు, ఫిబ్రవరి 22: బిక్కవోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అనధికార వ్యక్తులు చేసిన రాజకీయ ప్రసంగాలపై టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ మాధవీలతకు చేసిన ఫిర్యాదుపై గురువారం మండల పరిషత్ కార్యాలయంలో డీఎల్‌డీవో వీణాదేవి విచారణ నిర్వహించారు. ఈనెల 5న జరిగిన సర్వసభ్య సమావేశంలో అనధికారికంగా ప్రసంగాలు చేసిన వివరాలను ఆమె అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విజయలక్ష్మి, కార్యాలయ సిబ్బంది, పలువురు ప్రజా ప్రతినిధులను విచారించారు. దీనిపై పూర్తిస్థాయి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈనెల 5న జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ భర్త కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, జడ్పీటీసీ భర్త రొంగల అప్పాజీ ప్రసంగాలు చేస్తూ వైసీపీని గెలిపించాలని కోరారని, అలాగే తనపై వ్యక్తిగత ఆరోపణలు చేశారన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు..

రైల్వే స్టేషన్‌లో.. తెలంగాణ బీర్లు స్వాధీనం

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మద్యాన్ని అక్రమంగా తీసుకొస్తున్న వ్యక్తిని ప్రభుత్వ రైల్వే పోలీసులు(జీఆర్పీ) అదుపులోకి తీసుకుని మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సీఐ విజయ్‌శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం తమకు వచ్చిన విశ్వసనీయ సమాచారంతో ఎస్ఐ కె.మావుళ్లు తమ సిబ్బందితో రెండో నెంబరు ప్లాట్‌ఫాంపై తనిఖీలు చేస్తుండగా అన్నపూర్ణమ్మపేటకు చెందిన జమ్ము పాపి నాయుడు బ్యాగ్‌లో 10బీర్లు ఉండడం గుర్తించారు. అతడిని ప్రశ్నించగా ఇక్కడ విక్రయించడానికి తెలంగాణ నుంచి తీసుకొ స్తున్నట్టు చెప్పాడని సీఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న బీర్లలో బడ్వయిజర్ మేగ్నం 5, ఎలిఫేంట్ స్ట్రాంగ్ సూపర్ ప్రీమియం 5 ఉన్నాయన్నారు.

దుప్పలపూడిలో అక్రమంగా కలప నరికివేత

ట్రాక్టర్‌లో తరలిస్తుండగా సీజ్ చేసిన అధికారులు

అనపర్తి ఫిబ్రవరి 22: అనపర్తి మండలం దుప్పలపూడిలో గురు వారం పంచాయతీ చెరువుగట్టుపై ఉన్న వెదురు కలపను అక్ర మంగా నరికి తరలిస్తుండగా అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. గ్రామంలో పంచాయతీకి చెందిన చెరువు గట్టుపై ఏళ్ల తరబడి వెదురు పెరిగింది. అక్రమార్కులు గురువారం సదరు కలపను నరికి ట్రాక్టర్‌పై తరలించే ప్రయత్నించారు. దీంతో స్థానికులు రెవెన్యూ కార్యాలయానికి సమాచారం అందించగా డీటీ శశిదర్ వెంటనే వీఆర్వో ఉపేంద్రను సంఘటనా స్థలానికి పంపి విచారణ చేయించారు. ఎటువంటి అనుమతులు లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శి శ్రీదేవికి సమాచారమివ్వగా ఆమె అక్కడికి వచ్చి కలపతో ఉన్న ట్రాక్టరును సీజ్ చేసి పంచాయతీ కార్యాలయానికి తరలించారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు చేపడతామని అన్నారు. కాగా గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు ప్రోద్బలంతోనే ఇదంతా జరిగిందని, కలపను వేరే గ్రామానికి చెందిన వ్యక్తికి అమ్మడంతో అతను ట్రాక్టర్ సహాయంతో తరలించే ప్రయత్నం చేస్తున్నారని దీనిపై పూర్తి విచారణ నిర్వహించాలని గ్రామస్థులు కోరుతున్నారు

భారీ అన్నసమారాధన

గోకవరం, ఫిబ్రవరి 22: భీష్మ ఏకాదశి సందర్భంగా గోకవరంలోని పోస్టాఫీస్ సమీపంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గురువారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో బత్తుల బ్రదర్స్ ఆధ్వర్యంలో సుమారు 10 రకాల వంటకాలను ప్రసాదంగా అందించారు.

కాంగ్రెస్ నాయకుడు కొండ్రాజు గృహనిర్బంధం

కడియం, ఫిబ్రవరి 22: దగా డీఎస్సీ కాదు.. మెగా డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ గురువారం చలో సెక్రటేరియట్ ముట్టడికి కాంగ్రెస్ పిలుపునిచ్చిన నేపథ్యంలో కడియం మండలం బుర్రిలంకలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు తాడాల కొండ్రాజుకు పోలీసులు నోటీసులిచ్చి గృహనిర్బంధం చేశారు. ఈ సందర్భంగా కొండ్రాజు మాట్లాడుతూ నిరుద్యోగుల పక్షాన పోరాటానికి పిలుపునిస్తే గృహనిర్బంధం చేయడం అన్యాయమన్నారు.

జక్కంపూడి, వంగవీటి విగ్రహాల ఆవిష్కరణ

కడియం, ఫిబ్రవరి 22: కడియంలో నిర్మించిన అంతర్గత రహదారికి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ శంకుస్థాపన చేశారు. అనంతరం మండలంలోని జేగురుపాడులో సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్ ఆధ్వర్యంలో జక్కంపూడి రామ్మోహనరావు, వంగవీటి మోహనరంగ విగ్రహాలను ఏర్పాటు చేశారు. విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమంలో వైసీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, చందన నాగేశ్వర్, జక్కంపూడి గణేష్, గిరజాల బాబు, వెలుగుబంటి అచ్యుతరామ్, తిరుమలశెట్టి శ్రీను, నర్సరీసంఘం అధ్యక్షులు మల్లు పోలరాజు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కోరుకొండ, ఫిబ్రవరి 22: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాజమహేంద్రవరం ఆర్డీవో చైత్రవర్షిణి గురువారం కోరుకొండలోని పలు పోలింగ్‌కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అలహరిసింగరిపేట ప్రాథమిక పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. తదుపరి వాటికి సమీపంలో ఉన్న మరో ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సాధ్యసాధ్యాలను తహశీల్దార్ రాజ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి గణేష్‌బాబును అడిగి తెలుసుకున్నారు. రెండు పోలింగ్ కేంద్రాలు మార్పు చేయాల్సి ఉంది. ఆ నెంబర్లు మార్చి నివేదిక పంపాలని చెప్పారు. ఈ పరిశీలనలో పలువురు రెవెన్యూ, పంచాయతీ రాజ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

గజవాహనంపై అనంత పద్మనాభుడి గ్రామోత్సవం

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి అధ్యయనోత్సవాలు



కోరుకొండ, ఫిబ్రవరి 22: కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి కొండపైన స్వామి వారి అధ్యయనోత్సవాలు శాస్త్రోక్తంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా గురువారం మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల మధ్య దేవుని కోనేరు వద్ద నుంచి అర్చకస్వాములు తీర్థ జలాలతో కొండపైకి వెళ్లారు. అక్కడ స్వామి వారికి అధ్యాపక స్వాములు ఉదయం, సాయంత్రం ద్రవిడ వేదాన్ని పారాయణం చేశారు. పారాయణంలో పరాసర రఘునాథ బట్టర్, పెదపాటి గిరిధరాచార్యులు, ఇరగవరపు కృష్ణామాచార్యులు తదితరులు పాల్గొన్నారు. అధ్యయనోత్సవాల్లో మూడో రోజు రాత్రి శ్రీ భూ సమేత అనంత పద్మనాభస్వామిని గజవాహనంపై ఆశీనులను చేసి గ్రామోత్సవం చేశారు. అంతకుముందు దేవస్థానం అనువంశిక ధర్మకర్తలు పరాసర లక్ష్మీనరసింహ భట్టర్, పరాసర రంగరాజభట్టర్, ఇరగవరపు కృష్ణామాచార్యులు, రఘురామాచార్యులు, చక్రవర్తి ఆచార్యులు, మార్గపురి నరసింహాచార్యులు, గజవాహనం ముందు ప్రబంధ పారాయణం చేశారు.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 22: బ్రిటిష్ పాలనలో వచ్చిన మార్పులకు అనుగుణంగా వ్యవసాయ రంగంలో రైతుల నుంచి కొత్తపన్నుల వసూలు విధానం అమలులోకి వచ్చినపుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చేసిన పోరాటం ఎంతో పటిష్టమైందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ చవాన్ శ్యామ్‌రాజ్‌నాయక్ అన్నారు. గురువారం వ్యవసాయ కళాశాలలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 177వ వర్ధంతి కార్యక్రమం ఎన్ఎస్ఎస్ పీవోలు పి.అమ్మాజీ, జి.రమేష్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాల వేశారు. ఆయనను తొలి స్వాతంత్ర్య సమరయోధుడిగా కీర్తించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ నెల 29లోగా లైసెన్సు పొందాలి

జిల్లా సహాయ కార్మిక కమిషనర్ వలీ



రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దుకాణదారులు తప్పనిసరిగా కార్మిక శాఖ నుంచి లైసెన్సు పొందాలని సహాయ కార్మిక కమిషనర్ బీఎస్ఎం వలీ పేర్కొన్నారు. కార్మిక చట్టం ప్రకారం ఈ నెల 29వ తేదీలోపుగా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందాలన్నారు. ఇప్పటికే రిజిస్ట్రేషను ఉన్నవారు రెన్యువల్ చేయించుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్, రెన్యువల్స్‌ని సింగిల్ విండో విధానంలో సచివాలయాలు, మీసేవ లేదా యజమాని నేరుగా ఆన్‌లైన్ విధానంలో మీసేవ వెబ్‌సైటులో ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకొని లైసెన్సు పొందవచ్చన్నారు. గడువు లోపుగా నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషను సర్టిఫికెట్ పొందని వాళ్లు చట్టపరమైన చర్యలకు బాధ్యు లవుతారన్నారు.

'ఆపరేషన్ వాలెంటైన్'ను ఆదరించండి

ప్రముఖ సినీ హీరో వరుణ్‌తేజ్.. రాజమహేంద్రిలో సందడి


మాట్లాడుతున్న హీరో వరుణ్‌తేజ్

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 22: ఆపరేషన్ వాలెంటైన్ మంచి దేశభక్తి సినిమా అవుతుందని ప్రముఖ హీరో, మెగాప్రిన్స్ వరుణ్‌తేజ్ అన్నారు. ఈ సినిమాను అందరూ ఆదరించి విజయం చేకూర్చాలని కోరారు. భూపాలపట్నంలోని రాజమహేంద్రి (రైట్) ఇంజనీరింగ్ కళాశాలలో ఈ సినిమా ప్రమోషన్‌ను గురువారం నిర్వహించి పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా బాగా చదవాలని, ప్రతిఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలని సూచించారు. డైరెక్టర్ శక్తిప్రతాప్‌సింగ్ హోడా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం మార్చి 1న విడుదలవుతుందన్నారు. హీరో వరుణ్‌తేజ్ రాకతో కళాశాలలో సందడి నెలకొంది. హీరోతో ఫొటోలు తీసుకునేందుకు విద్యార్థులు పోటీపడ్డారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జి.సాయిరాధాకృష్ణ, కార్యదర్శి, కరస్పాండెంట్ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపాల్ రాంబాబురెడ్డి, డైరెక్టర్ ఎస్.రవికిరణ్ పాల్గొన్నారు.

నర్సింగ్ సిబ్బందికి సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 22: ప్రైవేట్ హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్స్‌లో పనిచేస్తున్న సిబ్బందికి సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని, ఉద్యోగభద్రత కల్పించాలని, వేతనాల పెంపు చేపట్టాలని ది రాజమండ్రి ప్రైవేట్ హాస్పటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు శ్రీను డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం గాంధీపురంలో గురువారం యూనియన్ పతాకావిష్కరణ చేశారు. నాయకుడు రాజులోవ మాట్లాడుతూ సిబ్బందికి ఉద్యోగభద్రత లేకుండా పోయిందని, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సదుపాయాలు కొందరికే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్పిరిచ్యువల్ సొసైటీ ఏర్పాటు


పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 22: లోక కల్యాణార్థం స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం సూర్యారాధన చేస్తామని సంస్కృతి సొసైటీ ఫౌండర్ విక్రమాదిత్య గురువారం తెలిపారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలో స్పిరిచ్యువల్ సొసైటీని డీమార్ట్ వద్ద మీనాక్షి ఎన్‌క్లేవ్‌లో ఏర్పాటు చేశామన్నారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో అరుణ పారాయణం, మహాసౌర హోమం కూడా చేయిస్తామన్నారు. కార్యక్రమంలో అడబాల ప్రసాద్, లక్ష్మీ నైనిక, సుచిత్ర మూర్తి, సత్యవాణి, భవాని, అడ్వకేట్ నెహ్రూ, చరణ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మళ్లదొడ్డిలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు

గోకవరం, ఫిబ్రవరి 22: మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. అస్సాగో ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈప్లాంట్‌ను సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆశిష్ గుర్నాని ప్రారంభించారు. కార్యక్రమంలో అస్సాగో ఇండస్ట్రీ సిబ్బంది కల్నల్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ సునీల్‌కుమార్, నాయకులు సుంకర వీరబాబు, సమ్మెట రాంబాబు, శరకణం మురళీ, ఆబిరెడ్డి రాంభద్రం, పులగం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సన్‌రైజ్ వాటర్ ప్లాంట్ సీజ్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అధికారులు తనిఖీల్లో ఓ వాటర్ ప్లాంటుకు ఎలాంటి అనుమతులూ లేకపోవడం గుర్తించి సీజ్ చేశారు. నగరంలోని వీరభద్రాపురంలో ఉన్న 'ది సన్ రైజ్ వాటర్ ప్లాంట్‌లో సోదాలు చేశామని విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. అనుమతులు లేకుండా ప్లాంట్ నడుపుతున్నారని, జీఎస్టీ రిజిస్ట్రేషన్ కూడా లేదని తెలిపారు. దీంతో ప్లాంట్‌ను సీజ్ చేశామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: ఊరుపేరు భైరవకోన
సూర్యామినీ	: ముఖ్యగమనిక, క్రాక్
సూర్యాప్యాలస్	: భ్రమయుగం
స్వామి	: ఈగల్
శివజ్యోతి	: అంబాజీపేట మ్యారేజ్‌బ్యాండ్
అనుశ్రీ(సాయికృష్ణ)	: హనుమాన్
రాజా	: ఊరుపేరు భైరవకోన
అశోక	: ------
ఊర్వశి	: సిద్ధార్థ్‌రాయ్
రంభ	: యాత్ర-2, రాజధాని ఫైల్స్
మేనక	: మస్త్ షేడ్స్ ఉన్నాయిరా, లాల్‌సలామ్
అప్సర	: గుంటూరు కారం
కుమారి	: సుందరం మాస్టర్
వీఎస్ మహల్(నామవరం)	: ఊరుపేరు భైరవకోన
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: భ్రమయుగం
వెంకటసూర్య(కడియం)	: సిద్ధార్థ్‌రాయ్
సత్యగౌరి (అనపర్తి)	: హనుమాన్
సూర్యశ్రీ (అనపర్తి)	: ఊరుపేరు భైరవకోన
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: ఊరుపేరు భైరవకోన
రామకృష్ణ(కోరుకొండ)	: ఊరుపేరు భైరవకోన
గీతాసినిమాస్ (సీతానగరం)	: ఊరుపేరు భైరవకోన
శ్రీనివాస (గోకవరం)	: సైంధవ్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: ఊరుపేరు భైరవకోన
లలితామహల్(రంపచోడవరం)	: ఊరుపేరు భైరవకోన
నవయుగ(చింతూరు)	: సిద్ధార్థ్‌రాయ్





పెద్ద పులి పాద ముద్ర

సర్కారు కాటి దగా డీఎస్సీ



- ఆవేదనతో రగిలిపోతున్న నిరుద్యోగులు
- ఉమ్మడి తూర్పులో 2 వేల పోస్టులు ఖాళీ?
- ఇప్పుడు 390 పోస్టులకే నోటిఫికేషన్
- ఒక్కో ఉద్యోగానికి వేలల్లో దరఖాస్తులు
- సన్నద్ధతకూ సమయం లేక లబోదిబో
- అభ్యర్థుల్లో తీవ్ర మానసిక ఒత్తిడి
- ఎన్నికల ఎత్తు.. యువతకు మోసం

ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు బ్లాక్‌బోర్డంత.. భర్తీ చాక్‌పీసంత

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఐదేళ్లుగా ఎప్పుడా ఎప్పుడా అని ఎదురుచూస్తున్న డీఎస్సీ నోటిఫికేషన్ ఎన్నికల ఎత్తులో భాగంగా పరుగు పరుగున వచ్చేసి మెగా పేరుతో భావి ఉపాధ్యాయులను దగా చేస్తోంది. ఖాళీలు బ్లాక్ బోర్డంత ఉండగా భర్తీల సంఖ్య మాత్రం చాక్‌పీసంత కూడా లేదు. పైగా సన్నద్ధం కావడానికి తగు సమయాన్ని ప్రసాదించలేదు. కనీసం రివిజన్‌కి కూడా సమయం సరిపోదని ఎప్పటి నుంచో ప్రిపేర్ అవుతున్న వాళ్లు చెబుతున్నారు. దీంతో యువత ఒత్తిడిలో మునిగిపోయింది. తాము అధికారంలోకి వస్తే ప్రతి ఏడాదీ ఉద్యోగ నోటిఫికేషన్లను వరదలా పారిస్తామంటూ గప్పాలు కొట్టిన జగన్.. ఎన్నికల వేళ ఓ నోటిఫికేషన్‌ను హడావుడిగా తెరపైకి తెచ్చారు.గత ఎన్నికల ముందు ఓట్ల కోసం మెగా డీఎస్సీ అని ఊదరగొట్టిన జగన్‌కి మళ్లీ ఎన్నికల సమయానికిగానీ ఉద్యోగార్థుల ఆవేదన వినిపించలేదు.

ఖాళీలు 2వేల పైమాటే

ఉమ్మడి తూర్పు గోదావరిని పరిగణనలోకి తీసుకొని డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేశారు. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి కలిపి సుమారు 2వేలపైనాఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు ఉన్నట్టు తెలుస్తోంది. డీఎస్సీ నిర్వహణను కాకినాడ జిల్లా డీఈవో చూస్తున్నారు. ఆయన ఖాళీల సంఖ్యపై గోప్యత పాటిస్తున్నారు. ఐదేళ్లుగా నోటిఫికేషన్‌ని ప్రభుత్వం మరిచిపోవడంతో పెద్ద సంఖ్యలో ఖాళీలు పేరుకుపోయాయి.అలాగే అప్పటి నుంచీ కోచింగ్ తీసుకుంటున్న వాళ్లు ఏడాదికేడాదీ కలుస్తూ ఉద్యోగార్థుల సంఖ్య ఖాళీల కంటే చాలా రెట్లు ఎక్కువగా ఉంది.జగన్ ప్రభుత్వం అలసత్వం వల్ల పోటీ విపరీతంగా పెరిగిపోయింది. ఆ మేరకు అభ్యర్థుల్లో కూడా మానసిక ఒత్తిడి అధికమైంది. ఇప్పుడు మెగా డీఎస్సీ పేరుతో కేవలం 390 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయడంతో నిరుద్యోగులు విస్తుపోతున్నారు. ఒక్కో పోస్టుకు వేలల్లో దరఖాస్తులు వచ్చిపడ్డాయి.

సన్నద్ధతకు సమయమేదీ..

ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ఓట్లు రాబట్టుకునే ప్రణాళికలో భాగంగా ఎన్నికల షెడ్యూల్‌కి నెలముందు ప్రభుత్వం డీఎస్సీని ప్రకటించింది. ఉపాధ్యాయ అర్హత పరీక్షకు 20 రోజులు సమయం ఇచ్చి తర్వాత 10 రోజులకే డీఎస్సీ పెడుతున్నారు. ఇంత తక్కువ సమయంలో అభ్యర్థులు రెండింటికీ ఎలా సన్నద్ధమవుతారని కూడా పాలకులు ఆలోచించలేదు. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో వచ్చే మార్కులకు డీఎస్సీలో 20 శాతం వెయిటేజీ ఇస్తారు. కాబట్టి గతంలో టెట్ రాసినవాళ్లు కూడా మార్కులు పెంచుకునేందుకు మళ్లీ రాయడానికి సిద్ధమవుతుంటారు.గతంలో టెట్ రాయనివాళ్లు వెయిటేజీ కోసం ఎలాగూ రాయాల్సి ఉంటుంది. టెట్ సిలబస్ తక్కువేమీ ఉండదు. టెట్ సిలబస్‌ని 20 రోజుల్లో పూర్తి చేయడం అసాధ్యం. తర్వాత డీఎస్సీకి 10 రోజులే సమయం ఉంటుంది. టెట్‌తో పాటు జీవిత పయనాన్ని నిర్ణయించే డీఎస్సీకి సన్నద్ధం కావడం ఎలా సాధ్యమో జగనే చెప్పాలని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. ఒకపక్క పోస్టులు అతి తక్కువగా ఉండడం.. మరో పక్క పరీక్షల షెడ్యూల్‌తో విపరీతమైన టెన్షన్ కలిసి ఉద్యోగార్థులకు జగన్ మెంటల్ టార్చర్ అంటే ఏంటో అనుభవించేలా చేస్తున్నారు.కొందరు అభ్యర్థులు సోషల్ మీడియాలో పెడుతున్న పోస్టులు కంటనీరు పెట్టిస్తున్నాయి.

ఆన్‌లైన్ కష్టాలు..

ఇసుక.. మద్యం వ్యాపారంలో ఆరితేరిన పాలకులు చివరికి నిరుద్యోగులనూ వదలడం లేదు. పోస్టుల లేమితో ఓ వైపు ఇబ్బంది పడుతుంటే ఆన్‌లైన్ కష్టాలు ముప్పుతిప్పలు పెడుతున్నాయి. ఎలాంటి ముందస్తు కసరత్తు లేకుండా నోటిఫికేషన్‌ని ఎన్నికల వేళ హడావుడిగా ఇచ్చేయడం అభ్యర్థుల పాలిట శాపంగా మారింది. చివరికి ఫిర్యాదు చేయాలంటే సహాయ కేంద్రాల ఫోన్ నెంబర్లు కూడా వారితో ఆడుకుంటున్నాయి. ప్రతి దానికీ ఫీజును విధించి సర్కారువారు పేదలతో వ్యాపారం చేస్తున్నారు. తప్పులు వస్తే సరిచేయడానికి మరో ఆప్షన్ ఇవ్వకుండా రూ.750 కట్టాలని ఆన్‌లైన్‌లో చూపిస్తోంది. ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి దుస్థితి లేదని ఉద్యోగార్థులు వాపోతున్నారు. డీఎస్సీలో అభ్యర్థులు ఎక్కువ పోస్టులు ఉన్న జిల్లాలో పరీక్ష రాసేందుకు మొగ్గుచూపుతారు. దరఖాస్తు చేసే సమయంలో స్థానికేతర ఆప్షన్ ఎంచుకుంటే అన్ని జిల్లాల పేర్లు వస్తే అభ్యర్థి తాను కోరుకున్న జిల్లాను ఎంచుకుంటారు. కానీ చిత్రంగా స్థానికేతర ఆప్షన్ వస్తుంది కానీ జిల్లాల పేర్లు కనిపించడం లేదు. దీంతో మెరిట్ కోటా కింద దరఖాస్తు చేసుకునే వెసులుబాటును కోల్పోతున్నారు. స్కూల్ అసిస్టెంట్లతో పాటు ఇతర ఉద్యోగాలకూ జిల్లాల జాబితా రావడం లేదు.మరో విచిత్రం ఏమిటంటే.. పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లు(పీజీటీ), ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లు (టీజీటీ) పోస్టులు జోనల్ స్థాయిలో ఉంటాయి. వారికీ అదే పరిస్థితి ఎదురవుతోంది. జోన్ ఆప్షన్ వస్తుందేగానీ జోన్‌ల జాబితా రావడం లేదు. దరఖాస్తుకు కేవలం 10 రోజుల సమయం మాత్రమే ఇచ్చి సర్వర్ సమస్యలను పట్టించుకోవడం వదిలేశారు.

జగన్ మార్కు మెలిక

డీఎస్సీ నోటిఫికేషన్ విషయంలోనూ జగన్ మార్కు మెలిక తప్పలేదు. డీఎస్సీ పోస్టుల భర్తీలో కీలకమైన సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ) పోస్టులకు బీఈడీ అభ్యర్థులను అర్హులుగా ప్రకటించి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ప్రక్రియ జాప్యం చేయాలనే పన్నాగం పన్నినట్టు కనిపిస్తోంది. ఎస్జీటీ పోస్టులకు బీఈడీ అభ్యర్థులు అనర్హులని గతంలో సుప్రీంకోర్టు చెప్పింది. కోర్టులంటే గౌరవం లేని జగన్ ప్రభుత్వం ఆ ఆదేశాలు తెలిసి ఎస్జీటీ పోస్టులకు బీఈడీ వాళ్లను అర్హులుగా ప్రకటిస్తూ నోటిఫికేషన్ ఇచ్చేసింది. అయితే హైకోర్టు మొట్టికాయలతో ఎస్జీటీ పోస్టులకు డీఎడ్ వారిని మాత్రమే అనుమతిస్తామని తెలిపింది. ఇప్పుడు ఎస్జీటీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారి పరిస్థితి అయోమయంలో పడింది. వారు కట్టిన ఫీజు విషయమూ అంతే.

జిల్లా అధికారుల్లో భయం

డీఎస్సీ నిర్వహిస్తున్న అధికారులు ప్రభుత్వం నుంచి వస్తున్న మౌఖిక ఆదేశాలను పక్కాగా పాటిస్తున్నారు. అవి అభ్యర్థుల సమస్యలు తీర్చేవని అనుకుంటే పొరబాటే. ఎలాంటి సమాచారాన్నీ బయటకు పొక్కనివ్వవద్దనే ఆదేశాలు. దీంతో గుర్తించిన ఖాళీల సంఖ్యను చెప్పడానికీ జిల్లా స్థాయి అధికారులు బెంబేలెత్తిపోతున్నారు. కొందరు అధికారులు సీసీల చేతిలో తమ అధికారిక ఫోన్‌ని ఉంచుతూ వారితోనే సమాధానం చెప్పిస్తున్నారు. ఉమ్మడితూర్పులో ఎన్ని ఖాళీలను గుర్తించారనే సమాచారాన్ని ఈ క్రమంలో అత్యంత గోప్యంగా ఉంచుతున్నారు. అభ్యర్థుల ఆన్‌లైన్ తిప్పలను మాత్రం పట్టించుకునే వారు కరువయ్యారు. ఇక ఈ మెగా దగా డీఎస్సీపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలను, ప్రజాసంఘాలపై ప్రభుత్వం యథావిధిగా పోలీసులను ప్రయోగిస్తోంది.

బాబోయ్ పులి

- మలకపల్లి శివారు పొలాల్లో పులి సంచారం?
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక

తాళ్లపూడి, ఫిబ్రవరి 22 : మళ్లీ పులి కదలికలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల నల్లజర్ల, గోపాలపురం మండలాల్లో పులి సంచరించడంతో ఆయా ప్రాంతాల ప్రజలు భయం భయంగా బతికారు. అయితే పులి పాపికొండల మీదుగా అడవుల్లోకి వెళ్లిపోయిందని తెలిసి అంతా ఊపిరిపీల్చుకున్నాయి. అయితే మళ్లీ పులి అడుగుజాడలు కనిపిస్తుండడంతో అమ్మో పులి.. బాబోయ్ పులి.. అంటూ భయపడుతున్నారు. తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామం శివారు పొలాల్లో పులి పాద ముద్రలు కనిపించడంతో ఫారెస్ట్ అధికారులు అప్రమత్తమయ్యారు. పాపికొండలు నేషనల్ పార్కు నుంచి తప్పించుకు వచ్చిన పులి తాళ్లపూడి మండలంలో తిరుగుతుందనే ప్రచారంతో పలు గ్రామాల ప్రజలు భయాందోళన పడుతున్నారు. అయితే గతంలో అడువుల్లోకి వెళ్లిపోయిన పులి మళ్లీ వెనక్కి వచ్చి ఉండొచ్చని రాజమహేంద్రవరం డీఎఫ్‌వో డి.నాగరాజు ధ్రువీకరించారు. ఇటీవల గోపాలపురం మండలం వెంకటాయపాలెం గ్రామంలో పులి అడుగులు గుర్తించగా గురువారం ఉదయం మలకపల్లి తిరుగుడుమెట్ట గ్రామాల మధ్య పొలాల్లో పులి సంచరించిన ఆనవాళ్లు రైతులు గుర్తించి అధికారులకు సమాచారం అందించారు. ఈ మేరకు అటవీశాఖ అధికారులు సంఘటనా ప్రదేశానికి చేరుకుని పులి పాద ముద్రలు పరిశీలించారు. డీఎఫ్‌వో నాగరాజు మాట్లాడుతూ రైతులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. పూర్తిగా వెలుతురు వచ్చాక గానీ పొలాలకు వెళ్లవద్దని.. చీకటి పడకుండా పొలం పనులు ముగించుకుని తిరిగి రావాలని సూచించారు. ఈ మేరకు గ్రామంలో ప్రజలకు టాం టాం ద్వారా హెచ్చరికలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో ఎల్ ధనరాజ్, దావీదురాజు, డీఆర్‌వోలు వేణుగోపాల్, మీనాక్షి, రామకృష్ణ, సూరిబాబు, ధర్మయ్య పలువురు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, తాళ్లపూడి తహశీల్దార్ శీనివాస్, ఎస్ఐ శ్యామ్ సుందర్,పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



పులి పాదముద్రలు పరిశీలిస్తున్న అటవీ శాఖాధికారులు

మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి నిరసన 8

రేపు సర్పంచ్‌ల కలెక్టరేట్ ముట్టడి

కొవ్వూరు, ఫిబ్రవరి 22 : స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసే విధంగా వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 24వ తేదీన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు కలెక్టరేట్ల ముందు ధర్నాలు, నిరాహారదీక్షలు చేపట్టాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పాలడుగుల లక్ష్మణరావు పిలుపునిచ్చారు.కొవ్వూరులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు.ఈ నెల 20న విజయవాడలో జరిగిన సర్పంచ్‌ల సమర శంఖారావం సభ తీర్మాణం మేరకు సర్పంచ్‌లు ఐక్యంగా పోరాడాలన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌రెడ్డిని ఓడించి స్థానిక సంస్థలు కాపాడుకోవాలన్నారు.

మార్చి 4న అయోధ్యకు ఆర్టీసీ బస్సు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 22 : రాజమహేంద్రవం డిపో నుంచి వివిధ హిందూ, క్రైస్తవ పుణ్యక్షేత్రాలకు సూపర్ లగ్జరీ బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. అయోధ్య, కాశీ 11 రోజుల యాత్రకు మార్చి 4వ తేదీన సూపర్ లగ్జరీ నాన్ ఏసీ బస్సు నడుపుతున్నట్టు రాజమహేంద్రవరం డిపో మేనేజర్ ఎస్‌కే షబ్నం తెలిపారు.13 మహిమాన్విత దేవాలయాల దర్శనం ఉంటుందని, టిక్కెట్ ధర ఒక్కొక్కరికీ రూ.11,800లుగా నిర్ణయించామన్నారు.అరుణాచల యాత్ర ప్రతినెలా పౌర్ణమి రోజున దర్శించుకునే విధంగా బస్సు నడుపుతున్నామని, టిక్కెట్ ఒక్కొక్కరికీ రూ.3,200లు అని తెలిపారు. క్రైస్తవ క్షేత్ర దర్శనాలకు సూపర్‌లగ్జరీ బస్సు నడపడం జరుగుతుందని టిక్కెట్ ఒక్కొక్కరికీ రూ.4,250లుగా నిర్ణయించామన్నారు.వివరాలకు 9502300189, 99666 66544, 99592 25535 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

రేపు వికాస ఆధ్వర్యంలో జాబ్ మేళా

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 22: రాజమహేంద్రవరం జిల్లా కలెక్టరేట్‌లో ఈనెల 24న వికాస ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని వికాస పీడీ కే.లచ్చారావు తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ మేనేజర్స్, ఆఫీసర్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు,డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ (ప్రొడక్షన్) సీఐఈ డిక్సన్ కంపెనీలో టెక్నీషియన్స్ ఉద్యోగాలకు ఇంటర్వూలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో అండ్ డిగ్రీ ,బీటెక్ ఉత్తీర్ణులైన 30 ఏళ్లలోపు వయస్సుగల వారు ఇంటర్వ్యూలకు అర్హులని తెలిపారు. ఆసక్తిగల వారు ఈనెల 24న బొమ్మూరు కలెక్టరేట్ వికాస కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. సమాచారానికి 76608 23903 నెంబరులో సంప్రదించాలని కోరారు.





గోపాలపురం సీహెచ్‌సీలో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రశ్నిస్తున్న ఎంఈవో

మిడ్ డే మీల్స్ తిని.. ఐదుగురికి అస్వస్థత

గోపాలపురం, ఫిబ్రవరి 22: మండలంలోని గంగోలు గ్రామ పంచాయతీ శివారు గ్రామమైన యర్రవరం ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిని ఐదుగురు విద్యార్థులు బుధవారం రాత్రి అస్వస్థతకు గురయ్యారు.సాయంత్రం 8 గంటల సమయంలో చిన్నారులకు వాంతులు కావడంతో ఐదుగురు విద్యార్థులను తల్లిదండ్రులు హుకుంపేట పీహెచ్‌సీలో చేర్పించారు. వారిలో ఇద్దరు వెంటనే కోలుకున్నారు. మరొక ఇద్దరిని గోపాలపురం సీహెచ్‌సీకి, మరొకరిని తాళ్లపూడి ఆసుపత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు. అస్వస్థతకు గురైన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకునేందుకు ఎంఈవో జీ.శ్రీనివాసరావు గురువారం ఉదయం గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలపడంతో విద్యాశాఖాధికారులు ఊపిరి పీల్చుకున్నారు. దీనిపై ఎంఈవో జీ.శ్రీనివాసరావును వివరణ కోరగా విద్యార్థులు అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరిన మాట నిజమేనని క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

ప్లానింగ్ ఉంటే.. పరీక్షా సులువే!





ఉందిగా సెప్టెంబరు మార్చిపైన అనుకోవద్దు..

- మార్చి 1 నుంచి పబ్లిక్ పరీక్షలు
- జిల్లాలో 41,300 మంది విద్యార్థులు
- భవితను నిర్ణయించే ఇంటర్
- మీ రాతను మార్చేది చేతిరాతే
- కష్టపడి చదివితే విజయం మీదే
- ప్రతి పరీక్షను ఇష్టంగా రాయండి
- తల్లిదండ్రులు సహకరించాల్సిందే
- పరీక్ష కేంద్రానికి ముందే వెళ్లాలి
- ఆర్టీసీ బస్‌లకు కలెక్టర్ ఆదేశం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఇంటర్మీడియెట్‌లో సాధించే మార్కులే భవిష్యత్తును నిర్ణయిస్తాయనడంలో సందేహం లేదు. ఇంటర్‌లో అశ్రద్ధ చేసి తర్వాత అనుకున్న విద్యను అభ్యసించలేక ప్రతి ఏడాదీ వేలాది మంది విద్యార్థులు వెనుకబడుతూ ఉంటారు. ఉదాహరణకు ఒక ఊరెళదామని ప్లాన్ చేసుకొని బస్టాండుకు వెళితే ఆ ఊరెళ్లే బస్సు ఎక్కి అనుకున్న గమ్యం చేరవచ్చు.అయితే ముందస్తు ప్లానింగ్ లేకపోతే అంతా అయోమయమే.చివరికి గమ్యం చేరే దారి కానరాక సందిగ్ధంలో పడిపోయే ప్రమాదం ఉంది. పరీక్షల విషయంలో కూడా ఒక పద్ధతి,ప్రణాళిక పాటిస్తే లక్ష్యం చేరడం పెద్ద కష్టమైన పనేమీ కాదన్నది పెద్దలు చెప్పిన మాట.ఇప్పటికే ప్రాక్టికల్స్ పరీక్షలు ముగిశాయి.వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల కోసం 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

సమయపాలన కీలకం

సమయం ఎప్పుడూ అత్యంత విలువైనదే. గడచిన క్షణాన్ని వెనక్కి రప్పించడం ఎవరి తరమూ కాదు. పరీక్షల వేళ సమయపాలన అనేది మరింత కీలకమైన భూమిక పోషిస్తుంది. ఒక్క నిమిషం కూడా భవిష్యత్తును నిర్ణయిస్తుందని గుర్తుంచుకోవాలి. కాలయాపన చేస్తే ఖచ్చితంగా ఆందోళన తప్పదు. సబ్జెక్టులు లేదా వాటిలో మిగిలిన పాఠాలు చూసి భయపడకూడదు. ప్రతి సబ్జెక్టుకూ నిర్ణీత సమయం కేటాయించుకుని తప్పనిసరిగా అనుసరించాలి. పరీక్షలకు ఇంకా ఎన్నో రోజుల సమయం లేదు కాబట్టి రివిజన్‌కి ప్రాధాన్యం ఇవ్వాలి.

మార్కులు తెచ్చే చేతిరాత..

పరీక్షలో చేతిరాతకూ ప్రాధాన్యం ఉంటుంది. జవాబు ఇష్టానుసారం రాసుకుపోతే ఆశించిన ఫలితం ఉండదు. రాసిన జవాబులో స్పష్టత కొరవడడంతో పేపర్లు దిద్దేటప్పుడు(మూల్యాంకనం) అధ్యాపకులకు ఇబ్బందిగా ఉంటుంది. దీంతో మార్కులు తగ్గే అవకాశం ఉండొచ్చు. అలాగే స్పెలింగ్ తప్పులు రాకుండా చూసుకోవాలి. ఫార్ములాలు, సూత్రాలు, ఈక్వేషన్లు వంటివి రాసేటప్పుడు, డయాగ్రాంలు వేసినప్పుడు కచ్చితంగా అర్థం అయ్యే రీతిలో ఉండాలి. సోషల్, బయాలజీ, లాంగ్వేజెస్ రాసేటప్పుడు సైడ్ హెడ్డింగ్‌తో రాస్తే మరింత మేలు.

పరీక్షా సమయంలో..

ముఖ్యంగా పరీక్ష కేంద్రం వద్దకు నిర్ణీత సమయం కంటే అరగంట ముందుగానే చేరుకోవాలి. కాసేపు ప్రశాంతంగా కూర్చోవాలి. మానసికంగా ఎట్టి పరిస్థితుల్లోనూ ఒత్తిడి పడకూడదు. ఇది కష్టమైన సబ్జెక్టు అనే భావన మనసులోంచి తీసేయాలి. ప్రశ్నపత్రం అందుకున్న వెంటనే ఒకసారి పేపరు ప్రశాంతంగా పూర్తిగా చదువుకోవాలి. ఆన్సర్ షీటుపై హాల్ టికెట్ తదితర సమాచారాన్ని తప్పులు లేకుండా కరెక్టుగా రాయాలి.ప్రశ్నపత్రంలో బాగా జవాబు తెలిసిన వాటిని టిక్ పెట్టుకొని రాయడం ప్రారంభించాలి. తర్వాత కొద్దిగా జవాబు తెలిసిన వాటిని రాయాలి. చివరిగా సమయం ఉంటే మిగిలిన ప్రశ్నల జోలికి వెళ్లాలి.సమయాన్ని చూసుకుంటూ జవాబులు రాస్తుండాలి.ఒకే ప్రశ్నకు సమయాన్ని వృథా చేయకూడదు. ఒక ప్రణాళిక ప్రకారం పరీక్ష రాయాలి.రవాణా విషయంలో విద్యార్థులు ఒక్కోసారి ఇబ్బంది పడుతూ ఉంటారు. అలాంటి వారు తారసపడితే ద్విచక్ర వాహనం, ఆటో, కార్ల చోదకులు సహకరించి వారిని పరీక్ష కేంద్రాల వద్దకు చేర్చడం సామాజిక బాధ్యతగా గుర్తుంచుకోవాలి.

డాట్స్ ఉంటే డయల్...

తూర్పుగోదావరిలో ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. 37,502 మంది మొదటి, రెండో సంవత్సర విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో మొదటి ఏడాది 19,336, రెండో ఏడాది 18,166 మంది విద్యార్థులు ఉన్నారు. ఒకేషనల్‌కి సంబంధించి 3,802 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉంది.విద్యార్థుల సందేహాల నివృత్తికి 94922 26232, 0883- 2473430 నెంబర్లను ఏర్పాటు చేశారు. కార్యాలయ వేళల్లో ఆ నెంబర్లకు ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. ఇన్విజిలేటర్లు, ఫ్లైయింగ్ స్క్వాడ్లు తదితర 1350 మంది సిబ్బంది పరీక్షల నిర్వహణలో పాల్గొనున్నారు.

ఇంటి నుంచి ఇలా..

దారిలో ఇబ్బందులను ఎవరూ ఊహించలేరు. పరీక్ష కేంద్రానికి అరగంట ముందుగానే చేరుకొనే విధంగా సమయాన్ని అంచనా వేసుకొని ఇంటి నుంచి బయలుదేరాలి. హాల్‌టికెట్, ప్రభుత్వం చేత జారీ చేయబడిన ఆధార్ తదితర ఏదోక గుర్తింపు కార్డు, పరీక్ష రాయడానికి అవసరమైన పెన్నులు, పెన్సిలు, స్కేలు తదితర వస్తువులను ముందు రోజు రాత్రే సిద్ధం చేసుకొని గుర్తుగా ఒకచోట పెట్టుకోవాలి.పెన్నులు అప్పుడే కొన్నవి కాకుండా అలవాటుగా వాడే పెన్నులను సిద్ధం చేసుకోవాలి. ఒకటి అదనంగా ఉండేట్లు చూసుకోవాలి. పరీక్షకు ప్రిపేర్ అవుతూ నిద్రాహారాలను పట్టించుకోకపోతే మొదటికే మోసం వస్తుంది. అందువల్ల కనీసం 6-7 గంటలు నిద్ర ఉండేట్లు చూసుకోవాలి. సాత్వికాహారం తింటే మేలు. ధ్యానం, యోగాను కొద్ది నిమిషాల పాటు చేస్తే మెదడు మరింత చురుగ్గా పనిచేసే అవకాశం ఉంటుంది.టీవీ,సెల్‌ఫోన్ వంటి వాటితో సమయం వృథా కాకుండా చూడాలి. ఇంట్లో పరిస్థితులు పిల్లల మార్కులపై ప్రభావం చూపెడతాయి.తల్లిదండ్రులు పిల్లలను సాధ్యమైనంత వరకూ ప్రశాంతంగా ఉంచాలి. వారి అనుపానువులు గమనిస్తూ ఏదైనా ఇబ్బంది ఉంటే సున్నితంగా గద్దించాలి.

ఇక ఆరు రోజులే గడువు..

మార్చి 1 నుంచి మొదటి ఏడాది, మార్చి 2వ తేదీ నుంచి రెండో ఏడాది విద్యార్థులకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్షలు నిర్వహిస్తారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాల వద్దకు ఉదయం 8.30 గంటల్లోగా చేరే విధంగా చూసుకోవాలి. మొదటి ఏడాది విద్యార్థులకు 1న సెకండ్ లాంగ్వేజీ, 4న ఇంగ్లీష్, 6న లెక్కలు-1ఏ, బోటనీ, సివిక్స్ 9న లెక్కలు-1బీ, జువాలజీ, హిస్టరీ, 12న ఫిజిక్స్, ఎకనామిక్స్, 14న కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ, ఫైన్ ఆర్ట్స్,మ్యూజిక్, 16 పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్, బ్రిడ్జి కోర్సు మ్యాథ్స్(బైపీసీ విద్యార్థులకు), 19న మోడరన్ లాంగ్వేజీ, జాగ్రఫీ పరీక్ష ఉంటుంది. రెండో ఏడాది విద్యార్థులకు మార్చి 2న సెకండ్ లాంగ్వేజీ, 5న ఇంగ్లీష్, 7న మ్యాథ్స్, బోటనీ, సివిక్స్, 11న మ్యాథ్స్, జువాలజీ, హిస్టరీ, 13న ఫిజిక్స్, ఎకనా మిక్స్, 15న కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ, ఫైన్ ఆర్ట్స్,మ్యూజిక్, 18న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్, బ్రిడ్జి కోర్సు మ్యాథ్స్(బైపీసీ విద్యార్థులకు), 20న మోడరన్ లాంగ్వేజీ, జాగ్రఫీ పరీక్షలు నిర్వహిస్తారు.

సీసీ కెమెరాల నిఘాలో

పరీక్ష కేంద్రాల వద్ద మంచినీరు, అత్యవసర మెడిసిన్, నిరంతర విద్యుత్ సరఫరా తదితర అన్ని ఏర్పాట్లనూ చేస్తున్నారు.పరీక్షా సమయాలకు అనుగుణంగా ఆయా రూట్లలో ఆర్టీసీ బస్సులు నడపాలని కలెక్టర్ మాధవీలత ఇప్పటికే ఆదేశించారు. దివ్యాంగులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేశారు.సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణలో పరీక్షలు జరుగుతాయి.సిబ్బందితో సహా విద్యార్థులెవరూ ఎలక్ట్రానిక్ పరికరాలు,ఎలక్ట్రానిక్ వాచీలను ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించరు.పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షను అమల్లో ఉంటుంది.పోలీసులు బందోబస్తు నిర్వహిస్తారు.

ఒత్తిడికి గురికావొద్దు..



జంబ్లింగ్ విధానం వల్ల హాల్ టికెట్ తీసుకున్న తర్వాత పరీక్ష కేంద్రం ఎక్కడో ఓసారి సందర్శించాలి. పరీక్ష ఉన్న రోజున అరగంట ముందుగానే విద్యార్థి కేంద్రం వద్దకు చేరేలా తల్లిదండ్రులు చూసుకోవాలి. ప్రశాంత వాతావరణంలో పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ చేశాం. విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్‌కి దూరంగా ఉండాలి. ఒత్తిడి పడకుండా మంచి మార్కులు వచ్చే విధంగా పరీక్షలు రాయాలి. అల్ ది బెస్ట్. **- ఎన్ఎస్‌వీఎల్ నరసింహం, ఇంటర్ ప్రాంతీయ పర్యవేక్షకులు**

నేటి నుంచి ఇంటర్ హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థుల హాల్ టికెట్లను ఆయా కాలేజీల లాగిన్‌కి పంపించామని శుక్రవారం నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. విద్యార్థులు ఆయా కళాశాలల్లో హాల్‌టికెట్లు పొందాలని సూచించారు. హాల్ టికెట్లు పొందడం తదితర విషయాల్లో ఏదైనా ఇబ్బందులు ఎదురైనా, సందేహాల నివృత్తి కోసం 9492226232, 0883 2473430 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈ నెంబర్లు ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7గంటల వరకూ అందుబాటులో ఉంటాయన్నారు. గురువారం రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ఇంటర్ అధికారులతో కలిసి ఆమె పాల్గొన్నారు. 52 పరీక్షా కేంద్రాల్లో 41,304 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. వీరిలో 3,802 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారన్నారు. సమావేశంలో జోన్ 1,2 ఆర్జేడీ ఐ.శారద, ఆర్ఐవో నరశింహం తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్ పరీక్షలపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ మాధవీలత

కాంగ్రెస్ నాయకుల అరెస్టుకు నిరసన



కాపవరంలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కొవ్వూరు, ఫిబ్రవరి 22: విజయవాడ ఏపీసీసీ కార్యాలయం వద్ద కాంగ్రెస్ నాయకులు కార్యకర్తల అరెస్టును నిరసిస్తూ గురువారం మండలంలోని కాపవరంలో డీసీసీ మాజీ అధ్యక్షుడు ఎండీ రఫీయుల్లాబేగ్ ఆధ్వర్యంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మోతా శారద సమక్షంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్రంలో 30వేల ఖాళీలు ఉండగా 6 వేల పోస్టులకు మాత్రమే డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. ఏఐసీసీ సభ్యురాలు అమర్‌జహా బేగ్ మాట్లాడుతూ దగా డీఎస్సీ వద్దు, మెగా డీఎస్సీ ముద్దు అంటూ సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమానికి వెళ్తున్న ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి, కాంగ్రెస్ నాయకులను అడ్డుకోవడం తగదన్నారు. జాబ్ క్యాలెండర్ ఊసెత్తని జగన్మోహనరెడ్డికి రానున్న ఎన్నికల్లో నిరుద్యోగ యువత తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో కిసాన్‌సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కలగర హరిబాబు, సాకా పుల్లారావు, మట్టా సుబ్బారావు, కె.చంద్రశేఖర్, కె.సురేష్, ఎ.బాదుషా తదితరులు పాల్గొన్నారు.

మలకపల్లిలో పోలింగ్ కేంద్రం పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ శ్రీనివాస్

తాళ్ళపూడి, ఫిబ్రవరి 22: త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని మలకపల్లిలోని హైస్కూల్‌లో పోలింగ్‌బూత్‌ను తహశీల్దార్ సీహెచ్ శ్రీనివాస్ పోలింగ్‌బూత్‌ల గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 44 పోలింగ్ కేంద్రాలున్నాయని వాటి ఏర్పాట్లను తమ సిబ్బందితో కలిసి పరిశీలిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్.కిషోర్, వీఆర్వో శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తాంజనేయస్వామికి తమలపాకుల పూజ

పెరవలి, ఫిబ్రవరి 22: నల్లాకుల వారి పాలెంలో భక్తాంజనేయస్వామి వార్షికోత్సవాలు మూడు రోజులుగా నిర్వహిస్తున్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం లక్ష తమలపాకుల పూజ చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు వచ్చి స్వామిని దర్శించుకున్నారు. చిన్న పిల్లలకు పటికబెల్లంతో తులాభారం వేసి పలువురు మొక్కులు చెల్లించుకున్నారు.

పెరవలిలో మంచు దుప్పటి



పెరవలి, ఫిబ్రవరి 22: ప్రతిరోజూ మంచు కురుస్తూనే ఉంది. తెల్లవారు జామున మొదలైన పొగ మంచు 8గంటల వరకు అలాగే ఉంటోంది. మధ్యాహ్న సమయంలో మాత్రం ఎండ వేడిమి పెరిగింది. ఈ విధంగా మంచు మరికొద్ది రోజులు ఉండవచ్చుని భావిస్తున్నారు. పొగ మంచు వల్ల రోడ్లపై వాహనదారులు పలు ఇబ్బందులు పడుతున్నారు.

కవలల దినోత్సవం

దేవరపల్లి, ఫిబ్రవరి 22: దేవరపల్లిలోని భాష్యం స్కూల్‌లో కవలల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా భాష్యం ప్రిన్సిపాల్ పేరయ్యనాయుడు మాట్లాడుతూ తమ స్కూల్లో 12మంది కవలల పిల్లలు చదువుకుంటున్నారని, వీరిలో ఒకే కుటుంబానికి చెందిన కవలలు ముగ్గురు ఉన్నారని, అవినాష్, త్రివర్షిత, కవలల దినోత్సవం రోజున పుట్టారని దీంతో ప్రతీ ఏడాది కవలల వేడుకను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో భాష్యం జోనల్ ఇన్‌చార్జ్ జీఎస్ సత్యనారాయణ, చాంప్స్ ప్రిన్సిపాల్ షేక్ సభాన, వ్యాయమ ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

రైతుల పోరాటంపై ప్రభుత్వాల దమనకాండ



దేవరపల్లి బస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

దేవరపల్లి, ఫిబ్రవరి 22: ఢిల్లీలో జరుగుతున్న రైతుల పోరాటంపై కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం, హరియాణా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న దమనకాండ యువ రైతు కరణ్‌సింగ్ మృతికి కారణమైందని రైతు సంఘం నాయకుడు ఉండవల్లి కృష్ణారావు విమర్శించారు. దేవరపల్లిలో బస్టాండ్ వద్ద గురువారం కరణ్‌సింగ్ మృతికి, రైతులపై జరిగిన దమనకాండకు నిరసనగా రైతు సంఘం వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన, ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు ఉండవల్లి కృష్ణారావు మాట్లాడుతూ పంటలకు మద్దతు ధర కోరుతూ రైతులు చేస్తున్న న్యాయమైన ఆందోళనపై బీజేపీ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గతంలో రైతులు చేసిన ఆందోళన సందర్భంగా ఇచ్చిన ఏ ఒక్క హామీని కేంద్ర ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. రైతుల ఉద్యమాన్ని సైన్యంతో అణచివేయాలని చూడడం అవివేకమన్నారు. రైతుల డిమాండ్లకు స్పందించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు, వివిధ కార్మిక సంఘాల నాయకులు సత్యనారాయణ, ఆచంట సుభాష్‌చంద్రబోస్, రామారావు, నాని, ఎస్.భగత్, రత్నాజీ తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలులో 100 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జీఎస్ నాయుడు

నిడదవోలు, ఫిబ్రవరి 22: నిడదవోలు ప్రభుత్వాసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు రూ.19 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. నిడదవోలులోని సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి పనులకు ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలోనే నిడదవోలు సీహెచ్‌సీలో డయాలసిస్ కేంద్రం కూడా అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తుందని అన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఇప్పటివరకు వైద్యం రూ.5 లక్షల వరకే పరిమితి ఉంటే వైసీపీ ప్రభుత్వం రూ.25 లక్షల వరకు వైద్య సదుపాయం పొందేలా చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైద్య ఆరోగ్య శాఖ అధికార్లు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కోరుకొండ, ఫిబ్రవరి 22: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాజమహేంద్రవరం ఆర్డీవో చైత్రవర్షిణి గురువారం కోరుకొండలోని పలు పోలింగ్‌కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అలహరిసింగరిపేట ప్రాథమిక పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. తదుపరి వాటికి సమీపంలో ఉన్న మరో ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సాధ్యసాధ్యాలను తహశీల్దార్ రాజ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి గణేష్‌బాబును అడిగి తెలుసుకున్నారు. రెండు పోలింగ్ కేంద్రాలు మార్పు చేయాల్సి ఉంది. ఆ నెంబర్లు మార్పి నివేదిక పంపాలని చెప్పారు.

పత్రికా స్వేచ్ఛను హరిస్తున్న వైసీపీ ప్రభుత్వం

- కొవ్వూరు ప్రెస్‌క్లబ్ సభ్యుల నిరసన
- సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవకు వినతి



సబ్‌కలెక్టర్ శ్రీవాస్తవకు వినతిపత్రం అందజేస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

కొవ్వూరు, ఫిబ్రవరి 22: పత్రికా స్వేచ్ఛను హరించే స్థాయికి వైసీపీ ప్రభుత్వం దిగజారడం సిగ్గుచేటంటూ కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం వద్ద పాత్రికేయుల నిరసన చేపట్టారు. మీడియా ప్రతినిధులు, సంస్థలపై వరుసగా జరుగుతున్న దాడులను నిరసిస్తూ కొవ్వూరు ప్రెస్‌క్లబ్ సభ్యులు గురువారం ఆర్డీవో కార్యాలయంలో సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవకు వినతిపత్రం అందజేశారు. అనంతపురం జిల్లా రాప్తాడులో సిద్ధం సభ కవర్ చేయడానికి వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణ, కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గంలో మద్దికెర గ్రామంలో హెల్త్‌క్లినిక్ ప్రారంభోత్సవానికి వెళ్లిన వీరేశఖర్‌పై, కర్నూలు జిల్లాలో ఈనాడు కార్యాలయాలపై దాడులకు పాల్పడిన వైసీపీ అల్లరిమూకలపై తక్షణం చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సబ్‌కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా సభలు, సమావేశాలు కవర్‌చేసే విలేకరులపై దాడులు చేయడం దుర్మార్గమన్నారు. నిజాన్ని నిర్భయంగా చూపించే మీడియాపై దాడి చేయడం వైసీపీ నాయకుల అవినీతి అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికేనన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలన్నారు. దాడులకు పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలని, దాడులు జరుగుతున్న సమయంలో సంఘటనా స్థలంలో ఉండి, ఏమి పట్టనట్టు వ్యవహరించిన పోలీసు, ఇతర అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జీపీఎస్ బాపూజీ, కట్టా దేవదాసు, అబ్దుల్ సూర్యప్రకాశరావు, తోట అవినాష్, గరగ వరప్రసాద్, పుప్పాల సురేష్, కెఎస్‌వీ సత్యసాయి, జోనగిరి అయ్యప్ప, జి.రవి, గొర్రెల యర్రన్న, మురమళ్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో అనపర్తి మాజీ ఎమ్మెల్యే నిరసన

- ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై ఫిర్యాదు చేసేందుకు వస్తే పట్టించుకోకపోవడంపై ఆగ్రహం
- కలెక్టరేట్‌లో నేలపై బైఠాయించిన రామకృష్ణారెడ్డి



కలెక్టరేట్‌లో బైఠాయించి నిరసన తెలుపుతున్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 22: తూర్పుగోదావరి జిల్లా కలెక్టరేట్‌లో అధికారుల తీరును నిరశిస్తూ అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ మాధవీలతను కలిసి అనపర్తి నియోజకవర్గం పరిధిలో జరుగుతున్న ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదు చేసేందుకు గురువారం కలెక్టరేట్‌కు వచ్చారు. అయితే కలెక్టర్, జేసీ, డీఆర్వో అందుబాటులో లేకపోయినా చాంబర్ చాంబర్‌కు తిప్పడంతో అధికారుల తీరుపై మండిపడ్డారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అనేక చోట్ల అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేయడానికి జిల్లా కలెక్టరేట్‌కు మధ్యాహ్నం వచ్చామన్నారు. కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో క్యాంప్ ఆఫీస్‌లో ఉన్నారని చెప్పడంతో జాయింట్ కలెక్టర్ కోసం చూశామన్నారు. అయితే ఆయన ట్రైనింగ్‌లో ఉన్నారని చెప్పారన్నారు దీంతో డీఆర్వో కోసం చూస్తే అక్కడ ఆయన కార్యాలయానికి తాళం వేసి ఉందన్నారు. ఇలా 45నిమిషాల పాటు అన్ని చాంబర్లు తిరిగినా ఎవ్వరు పట్టించుకోలేదన్నారు. దీంతో అధికారుల తీరుకు బైఠాయించి నిరసన తెలిపామన్నారు. అప్పుడు ఒక అధికారి వచ్చి వినతి తీసుకున్నారన్నారు. బదిలీ అయ్యి వెళ్ళిన పోసిబాబు అనే తహశిల్దార్ తిరిగి అనపర్తి వచ్చి డమ్మీపట్టాలపై సంతకం చేయడం, జరగని భూసేకరణ జరిగినట్లు చెబుతూ గ్రామాల్లో వాలంటీర్లు ,సచివాలయ సిబ్బంది రెవెన్యూ అధికారులు కలిసి డమ్మీపట్టాలు పంపిణీ చేయ్యడం చేస్తూ ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తున్నారని ఫిర్యాదు చేయ్యడానికి వస్తే ఇక్కడ పట్టించుకునే వారే లేరన్నారు. దినిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జిల్లాలో 109 టీబీ ముక్త్ పంచాయతీలు

- సీతానగరం మండలంలో 12 గుర్తింపు
- లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నివారణా అధికారి డాక్టర్ వసుంధర



మిర్తిపాడు పంచాయతీ వద్ద హెల్త్ సిబ్బందితో డాక్టర్ వసుంధర

సీతానగరం, ఫిబ్రవరి 22: ప్రధాన మంత్రి టీబీ ముక్త్ పంచాయతీలుగా జిల్లాలో 109 పంచాయతీలను గుర్తించగా సీతానగరం మండలంలో 12 పంచాయతీలను గుర్తించినట్లు లెప్రసీ, ఎయిడ్స్ క్షయ నివారణ ఆఫీసర్ డాక్టర్ వసుందర తెలిపారు. గురువారం ఆమె మిర్తిపాడు పంచాయతీ పరిధిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాన మంత్రి టీబీ ముక్త్ పంచాయతీలంటే.. ఏ పంచాయతీలోనైతే ఒక సంవత్సరంలో 1000 జనాభాలో 30 మంది క్షయ అనుమానితులను గుర్తించి వారందరికి క్షయ పరీక్షలు జరిపి వారిలో 0 నుంచి 1కేసులు మించకుండా పాజిటివ్‌గా నిర్ధారించబడతారో, వారు పూర్తిగా మందులు వాడతారో ఆ పంచాయతీలను టీబీ ముక్త్ పంచాతీలుగా గుర్తిస్తారన్నారు. ఈ మేరకు జిల్లాలో 109 పంచాయతీలను గుర్తించగా సీతానగరం మండలంలో 12 పంచాయతీలను గుర్తించారన్నారు. మిర్తిపాడు గ్రామంలో జరుగుతున్న కార్యక్రమాలు, రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. పీహెచ్‌సీ వైద్యులను ఎంఎల్‌హెచ్‌పీ, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్లు దివ్య, చైతన్య, మేఘన, ఎంపీహెచ్‌ఈఏ యర్రా సుబ్బారాయుడు, టీబీ సూపర్‌వైజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియో విజయవంతం చేద్దాం

నల్లజర్ల పీహెచ్‌సీ వైద్యుడు గంగాధరరావు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గంగాధరరావు

నల్లజర్ల, ఫిబ్రవరి 22: అన్ని శాఖల సమన్వయంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని నల్లజర్ల పీహెచ్‌సీ వైద్యుడు తెల్లం గంగాధరరావు అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో గురువారం జరిగిన పల్స్ పోలియో సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 3న జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని బాధ్యతాయుతంగా నిర్వహించాలని, రెవెన్యూ, విద్య, అంగన్‌వాడీ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని ప్రతి గ్రామంలో పల్స్‌పోలియో బూత్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ కిషోర్‌కుమార్, ఎంఈవో సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, వైద్య సిబ్బంది జీవీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

మద్దిపాటి పరామర్శ

నల్లజర్ల, ఫిబ్రవరి 22: నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెం ఉప సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు యద్దనపూడి బ్రహ్మరాజు నాయనమ్మ రత్తమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం ఆయన కుటుంబాన్ని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు పరామర్శించి ఆమె చిత్ర పటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో తాతిన సత్యనారాయణ, జమ్ముల సతీష్,కూచిపూడి ఉదయభాస్కరరావు, లంకా సత్యనారాయణ, నీలపాల వెంకన్న, సర్పంచ్ జార్జీవిక్టర్ తదితరలుఉ పాల్గొన్నారు.

కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ హౌస్ అరెస్ట్



మురళీకృష్ణకు 149 నోటీసు అందిస్తున్న పోలీసు

నిడదవోలు, ఫిబ్రవరి 22: నిడదవోలులో కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిన్నం మురళీకృష్ణను బుధవారం అర్ధరాత్రి 149 నోటీసు ఇచ్చి హౌస్ అరెస్ట్ చేసారు. ఈ సందర్భంగా చిన్నం మురళీకృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ తలపెట్టిన చలో సెక్రెటేరియట్ కార్యాక్రమాన్ని అడ్డుకునేందుకే వైసీపి ప్రభుత్వం కాంగ్రెస్‌పార్టీ నాయకులను హౌస్ అరెస్ట్ చేసిందని అన్నారు. కాంగ్రెస్‌పార్టీ నాయకులను హౌస్ అరెస్ట్ చేయడం పిరికిపంద చర్య అన్నారు.

నిడదవోలులో అధ్యాపకుడికి డాక్టరేట్

నిడదవోలు, ఫిబ్రవరి 22: నిడదవోలులోని ఎస్వీఆర్కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయినశాస్త్ర అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తున్న గునుపూడి రాహుల్‌కి తిరుపతి వెంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ కె.జ్యోతి తెలిపారు. రాహుల్ 'హెచ్‌పీఎల్‌సీ పద్ధతి ద్వారా క్రిమిసంహారక విశ్లేషణ'పై చేసిన పరిశోధనకు డాక్టరేట్ డిగ్రీ అందుకోవడం పట్ల కళాశాల అధ్యాపక బృందం అభినందించింది.

న్యాయవాదుల రిలే నిరాహారదీక్షలు

నిడదవోలు, ఫిబ్రవరి 22: వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను తక్షణం ఉపసంహరించుకోవాలని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్షలు గురువారం 47వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో న్యాయవాదులు ఎమ్ఎస్ఆర్ ప్రసాద్, సీహెచ్ విజయ్‌కుమార్, ఎం.మంగయ్య, ములగాల రవికుమార్, దేవులపల్లి రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాస శిక్షణ శిబిరం



నిడదవోలులో వ్యక్తిత్వ వికాస శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

నిడదవోలు, ఫిబ్రవరి 22: నిడదవోలులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కోరుమామిడిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం మానవత ఆధ్వర్యంలో నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాస శిక్షణా శిబిరం నిర్వహించారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు తాడేపల్లి మోహన్‌రావు విద్యార్థులకు శిక్షణా శిబిరం నిర్వహించారు. అనంతరం చదువులో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను నగదు, మెడల్స్, మెమెంటోతో సత్కరించారు. అనంతరం 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ప్యాడ్స్ పెన్స్ అందజేశారు. కార్యక్రమంలో కాజ గంగరాజు, ఉన్నమట్ల లీలా లక్ష్మి, గెడా రామచంద్రరావు, తన్నీడి బోసు, సూర్య చంద్రరావు, కొవ్వుల వెంకటేశ్వరరావు, నీలం రామారావు, పాతూరి అబ్బులు తదితర్లు పాల్గొన్నారు.

అనపర్తి ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి అవినీతిపై

బహిరంగ లేఖ

అనపర్తి, ఫిబ్రవరి 22: గడచిన నాలుగున్నరేళ్లలో అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి చేసిన రూ.500 కోట్ల అవినీతిపై చర్చకైనా, సత్య ప్రమాణికైనా తాను సిద్ధమని.. మీరు సిద్ధమా అంటూ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఎమ్మెల్యేకు బహిరంగ లేఖ రాసారు. సదరు లేఖను కరపత్రాల ద్వారా ముద్రించి గురువారం ఆయన ప్రజలకు పంపిణీ చేశారు. ఇటీవల కాలంలో ఎమ్మెల్యే చేస్తున్న ఆరోపణలపై స్పందించిన రామకృష్ణారెడ్డి తనపై వచ్చిన ఆరోపణలు, తాను ఎమ్మెల్యేపై చేసిన ఆరోపణలు వివరిస్తూ ప్రజలకు బహిరంగ లేఖ రాసారు. ఈ లేఖలో తనపై వచ్చిన ఆరోపణలు తాను చేస్తున్న ఆరోపణలపైనా ప్రజల్లోనే చర్చిం చుకుందామని అంతకూ కాకుంటే మీకు(ఎమ్మెల్యే) ఇష్టమైన సత్యప్రమాణానికి కూడా సిద్ధమని మీరు దీనికి సిద్ధమైతే వెంటనే స్పందించాలంటూ ఆయన బహిరంగ లేఖలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి రాసిన బహిరంగ లేఖను కరపత్రాలుగా ప్రచురించి గురువారం అనపర్తిలో ఆయనే స్వయంగా పంపిణీ చేస్తూ ప్రజల్లోకి వెళ్లారు. స్థానిక దేవీచౌక్ నుంచి మెయిన్ రోడ్డు, గాంధీబొమ్మ, రైల్వేస్టేషన్ వరకు కరపత్రాలను పంచుతూ తిరిగి దేవీచౌక్‌కు చేరుకుని బస్టాండ్‌లో ప్రయాణీకులకు కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మెయిన్‌రోడ్డులో ఉన్న ఎమ్మెల్యేకు చెందిన గంగిరెడ్డి నర్సింగ్ హోమ్‌లోకి వెళ్లి అక్కడ ఆసుపత్రి, మందుల షాపు సిబ్బందికి కూడా కరప త్రాలను పంపిణీ చేశారు. విషయం తెలుసుకున్న వైసీపీ శ్రేణులు అక్కడికి చేరుకున్నారు. దీంతో కొద్దిసేపు గాంధీబొమ్మ సెంటర్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యే చేసిన అవినీతిని సాక్ష్యాధారాలతో సహా ఎప్పటికప్పుడు మీడియా పరంగా వివరిస్తూనే ఉన్నానని దీనికి ఆయన ఏనాడూ సమాధానం చెప్పలే దని ఇప్పటికైనా సరే.. చర్చకైనా, సత్యప్రమాణానికైనా వచ్చి తన సచ్చీలతను నిరూపించుకోవాలన్నారు. ఎమ్మెల్యే అవినీతిని ప్రజలకు వివరించాలనే బహి రంగ లేఖను రాసినట్లు రామకృష్ణారెడ్డి చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, మల్లిడి కృష్ణారెడ్డి, రామ భాస్కరరెడ్డి, తేనెల శ్రీనివాస్, కర్రి వెంకటరామారెడ్డి, దత్తుడు శ్రీను పాల్గొన్నారు.

ఈ నెల 29లోగా లైసెన్సు పొందాలి

జిల్లా సహాయ కార్మిక కమిషనర్ వలీ



రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దుకాణదారులు తప్పనిసరిగా కార్మిక శాఖ నుంచి లైసెన్సు పొందాలని సహాయ కార్మిక కమిషనర్ బీఎస్ఎం వలీ పేర్కొన్నారు. కార్మిక చట్టం ప్రకారం ఈ నెల 29వ తేదీలోపుగా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందాలన్నారు. ఇప్పటికే రిజిస్ట్రేషను ఉన్నవారు రెన్యువల్ చేయించుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్, రెన్యువల్స్‌ని సింగిల్ విండో విధానంలో సచివాలయాలు, మీసేవ లేదా యజమాని నేరుగా ఆన్‌లైన్ విధానంలో మీసేవ వెబ్‌సైటులో ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకొని లైసెన్సు పొందవచ్చన్నారు. గడువు లోపుగా నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషను సర్టిఫికెట్ పొందని వాళ్లు చట్టపరమైన చర్యలకు బాధ్యు లవుతారన్నారు.

'ఆపరేషన్ వాలెంటైన్'ను ఆదరించండి

ప్రముఖ సినీ హీరో వరుణ్‌తేజ్.. రాజమహేంద్రిలో సందడి



మాట్లాడుతున్న హీరో వరుణ్‌తేజ్

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 22: ఆపరేషన్ వాలెంటైన్ మంచి దేశభక్తి సినిమా అవుతుందని ప్రముఖ హీరో, మెగాప్రిన్స్ వరుణ్‌తేజ్ అన్నారు. ఈ సినిమాను అందరూ ఆదరించి విజయం చేకూర్చాలని కోరారు. భూపాలపట్నంలోని రాజమహేంద్రి (రైట్) ఇంజనీరింగ్ కళాశాలలో ఈ సినిమా ప్రమోషన్‌ను గురువారం నిర్వహించి పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా బాగా చదవాలని, ప్రతిఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలని సూచించారు. డైరెక్టర్ శక్తిప్రతాప్‌సింగ్ హోడా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం మార్చి 1న విడుదలవుతుందన్నారు. హీరో వరుణ్‌తేజ్ రాకతో కళాశాలలో సందడి నెలకొంది. హీరోతో ఫొటోలు తీసుకునేందుకు విద్యార్థులు పోటీపడ్డారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జి.సాయిరాధాకృష్ణ, కార్యదర్శి, కరస్పాండెంట్ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపాల్ రాంబాబురెడ్డి, డైరెక్టర్ ఎస్.రవికిరణ్ పాల్గొన్నారు.

నర్సింగ్ సిబ్బందికి సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 22: ప్రైవేట్ హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్స్‌లో పనిచేస్తున్న సిబ్బందికి సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని, ఉద్యోగభద్రత కల్పించాలని, వేతనాల పెంపు చేపట్టాలని ది రాజమండ్రి ప్రైవేట్ హాస్పటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు శ్రీను డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం గాంధీపురంలో గురువారం యూనియన్ పతాకావిష్కరణ చేశారు. నాయకుడు రాజులోవ మాట్లాడుతూ సిబ్బందికి ఉద్యోగభద్రత లేకుండా పోయిందని, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సదుపాయాలు కొందరికే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్పిరిచ్యువల్ సొసైటీ ఏర్పాటు



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 22: లోక కల్యాణార్థం స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం సూర్యారాధన చేస్తామని సంస్కృతి సొసైటీ ఫౌండర్ విక్రమాదిత్య గురువారం తెలిపారు. ఈ మేరకు రాజమ హేంద్రవరంలో స్పిరిచ్యువల్ సొసైటీని డీమార్ట్ వద్ద మీనాక్షి ఎన్‌క్లేవ్‌లో ఏర్పాటు చేశామన్నారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో అరుణ పారాయణం, మహాసౌర హోమం కూడా చేయిస్తామన్నారు. కార్యక్రమంలో అడబాట ప్రసాద్, లక్ష్మీ నైనిక, సుచిత్ర మూర్తి, సత్యవాణి, భవాని, అడ్వకేట్ నెహ్రూ, చరణ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మళ్లదొడ్డిలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు



గోకవరం, ఫిబ్రవరి 22: మండలంలోని గుమ్మళ్ళదొడ్డి గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. అస్సాగో ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈప్లాంట్‌ను సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆశిష్ గుర్నాని ప్రారంభించారు. కార్యక్రమంలో అస్సాగో ఇండస్ట్రీ సిబ్బంది కల్నల్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ సునీల్‌కుమార్, నాయకులు సుంకర వీరబాబు, సమ్మెట రాంబాబు, శరక ణం మురళీ, అబిరెడ్డి రాంభద్రం, పులగం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సన్‌రైజ్ వాటర్ ప్లాంట్ సీజ్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అధికారులు తనిఖీల్లో ఓ వాటర్ ప్లాంటుకు ఎలాంటి అనుమతులూ లేకపోవడం గుర్తించి సీజ్ చేశారు. నగరంలోని వీరభద్రాపురంలో ఉన్న 'ది సన్ రైజ్ వాటర్ ప్లాంట్‌'లో సోదాలు చేశామని విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. అనుమతులు లేకుండా ప్లాంట్ నడుపుతున్నారని, జీఎస్టీ రిజిస్ట్రేషన్ కూడా లేదని తెలిపారు. దీంతో ప్లాంట్‌ను సీజ్ చేశామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్టు

చాగల్లు, ఫిబ్రవరి 22: మండలంలోని కలవలపల్లిలో అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసినట్టు ఎస్ఐ పినాగరాజు గురువారం తెలిపారు. సదరు మహిళ నుంచి 16 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సివిల్ (సీనియర్ డివిజన్) జడ్జి గారి కోర్టులో
E.P.No.52/2019 in O.S.No.228/2013

వేలం ప్రకటన

Between
డి.హెచ్.ఆర్: శ్రీ రంగిశెట్టి శ్రీరామకృష్ణ
Vs
జె.డి.ఆర్స్: శ్రీమతి శర్రి నరసాయమ్మ (లైఫ్) & ఇతరులు

పై నెంబరు డిక్రీ బాకీ వసూలు నిమిత్తం జె.డి.ఆర్స్ తాలూకు ఈ దిగువ ఉదహరించిన షెడ్యూలు దాఖలా స్థిరాస్థిని పై కోర్టువారి సమక్షంలో ది.22-03-2024వ తేదీన ఉదయం గం.10-30 నిల లగాయితు బహిరంగ వేలం జరుగును. కావలసిన వారు వచ్చి పాడుకొనవచ్చును. పాట షరతులు కోర్టు నజారత్ నందు అడిగి తెలుసుకొనవచ్చును.

షెడ్యూలు: తూ.గో.జిల్లా (గతంలో ప.గో.జిల్లా) కొవ్వూరు సబ్ రిజిస్ట్రార్‌లో చేరిన, కొవ్వూరు (మం), కొవ్వూరు టౌన్, ఇస్లాంపేట, 17వ వార్డు, చ.గ 57లు స్థలము, అందలి పాత అసెస్‌మెంటు నెం.8548, డోర్ నెం.12-14-10రు దాఖలా రెండు పోర్షన్ల పెంకుటింటికి హద్దులు.
తూర్పు: ద్యాలి సత్యనారాయణ
దక్షిణం: రోడ్డు
పడమర: నాదగల శ్రీనివాసరావు గారి పోర్షన్
ఉత్తరం: సత్యవరపు సత్యనారాయణ
డి.హెచ్.ఆర్ విలువ: రూ.1,50,000/- లు
అమీనా విలువ: రూ.2,85,000/- లు
వాయిదా తేదీ: 22-03-2024

దొండపాటి రంగారావు,B.A., B.L.,
డి.డి.వి. కృష్ణారావు, B.Com., L.L.M.
స్థలం : కొవ్వూరు
తేది: 22-02-2024
డి.హెచ్.ఆర్.తరపు న్యాయవాదులు,కొవ్వూరు